రహస్య దీవి

'రాజా'

గుడ్ లక్ సింగపూర్ తీరాన్ని వదిలి రెండు నిముషా లౌతూంది.

సింగపూర్ హార్బర్ దూరంగా కన్పిస్తోంది. బిల్డింగ్స్ పేక మేడల్లా ఉన్నాయ్.

డెక్ మీదనుంచి దిగి కేబిన్ లోకి వచ్చాడు త్రినాథ్. త్రినాథ్ నాతోటి ఏజెంట్.

చిన్నగా రొద పెడుతూ దక్షిణ చైనా సముద్ర జలా లలో ముందుకు సాగుతోంది మోటర్ బోట్ 'గుడ్ లక్.'

ఫ్రిజ్ డర్ తెరిచి బ్లాక్ నైట్ విస్కీ, నార్త్ పోల్ బీరు బాటిల్సు తీసాడు. టేబిల్ కు చెరో వైపునా

కూర్చున్నాము అతనూ నేను.

"ఫిషర్ ఎక్కడ?" అడిగాను. అతను మాకు సీ గైడ్. ఆ బోటులో మొత్తం మేము ముగ్గురమే ప్రయాణిస్తున్నాము.

"ఇంజన్ రూంలో ఉన్నాడు." నెమ్మదిగా అన్నాడు త్రినాథ్.

బీరు కలుపుకొని మగ్ అందుకొన్నాను. కొంచెంగా సిప్ చేస్తూ విండోలోంచి బైటకు చూడసాగాను. దూరంగా హార్బర్‌లో షిప్ వేస్తున్న కేక అస్పష్టంగా వినిపిస్తోంది.

'గుడ్ లక్' వేగాన్ని అందుకొంది. ఇంజన్ రూం లోంచి నవ్వుతూ బైటకొచ్చాడు ఫిషర్.

"ఎలా ఉంది కండిషన్," అడిగాను.

"ఫైన్. మూడురోజులవరకూ అవసరమైన కరెంట్ నిల్వ ఉంది."

"అదికాదు నేనడిగింది. వర్కింగ్ కండిషన్."

"క్వైట్ ఆల్ రైట్."

తృప్తిగా నిట్టూర్చాను. రెండు నిముషాలు మౌనంగా గడిచాయ్. ఫిషర్ వచ్చి మా ప్రక్కనే కూర్చొని విస్కీ అందుకొన్నాడు.

"ఫిషర్..." హఠాత్తుగా అడిగాను "మన ప్రయాణం ఎటువైపు సాగుతోంది."

వింతగా చూసాడు ఫిషర్ ఓ క్షణం. "మనేలా... ఫిలిఫైన్స్ వైపు!" అన్నాడు.

"నో! నాకెందుకో ఆ రూట్‌పై నమ్మకం కల్గటం లేదు. హాంకాంగ్ వైపు మార్చు!"

"హాంకాంగ్?" తృళ్ళిపడ్డాడు.

"యస్. అవసరమైతే మధ్యలో 'హైవన్' వైపు మారొచ్చు. అన్నట్లు హాంకాంగ్ దూరమెంత?"

"1440 నాట్ మైళ్ళు."

"ఎన్నాళ్ళు పడుతుంది చేరడానికి?"

"ఐదు రోజులు చాలు! మధ్యలో అవాంతరాలేమీ ఎదురవ్వకపోతే!"

"గుడ్, ఇంటర్నేషనల్ రూట్ కు 65 డిగ్రీల కోణంలో ప్రక్కనించి పోనివ్వు."

అలాగేనని తలూపాడు ఫిషర్. గ్లాస్‌లో మిగిలిన కొద్ది విస్కీ గొంతులో పోసుకొని ఇంజన్ రూంలోకి వెళ్ళాడు.

సిగరెట్ వెలిగించాను. చివర మండుతూ అంటుకొంది. ఊపిరి తిత్తులలోనికి బలంగా పీల్చి వదిలాను పొగ. వెచ్చగా హాయిగా ఉంది.

గుడ్‌లక్ ప్రయాణపు దిక్కు మారింది. ఆలోచిస్తూ విస్కీ త్రాగుతుండిపోయాను.

దక్షిణ చైనా సముద్రంలో ఒక రహస్యమైన దీవిలో చైనా అణ్వస్త్రాలను తయారు చేయసాగింది. ఈ ఆపరేషన్ బిగిన్ అయి రెండు నెలలు దాటుతోంది. మరో నెల రోజులలో అక్కడి శాస్త్రజ్ఞులు మూడు అటమిక్ రాకెట్లను నిర్మిస్తారు.

వాటిలో ఒకటి భారత్ పైనను, రెండవది రష్యా పైనను ప్రయోగించబోతున్నట్లు నమ్మకమైన ఏజంట్ల ద్వారా తెలియవచ్చింది. ఆ ఆపరేషన్ను స్మాష్ చేసే బాధ్యత బాస్ అంటే సి.బి.ఐ. డైరెక్టర్ మిశ్రాగారు తనపై పెట్టారు, ఎంతో విశ్వాసంతో.

తను వెంటనే ప్లేన్‌లో బయలుదేరి సింగపూర్ చేరు కున్నాడు. అక్కడి ఏజెంట్ త్రినాథ్ తనకు తోడుగా బయలుదేరాడు.

కాని యీ ఆపరేషన్ అనేక ప్రమాదాలతో కూడు కొన్నది. అసలు ఆ రహస్య దీవిని కనుగొనటమే బహు కష్టం. ఒకవేళ కనుగొన్నా దానిని నాశనం చేయటం తమ ఇద్దరితో సాధ్యమయ్యే పనికాదు. అయినా ఏదోవిధంగా సాధించాలి. భారతదేశాన్ని యీ ప్రమాదం నుంచి రక్షించాలి. దీనిలో తన ప్రాణాలు పోయినా లెక్క చేయడు తను.

చైనా అణ్వస్త్రాలు తయారుచేస్తున్న ఆ రహస్య దీవిని ఎల్లవేళలా రెండు సబ్‌మరైన్‌లు కాపలా కాస్తుం టాయి. అదీగాక దక్షిణ చైనా సముద్రంలో హాంకాంగ్ నుంచి పాంటియానక్ దాకా మరో రెండు యుద్ధ నౌకలు సంచరిస్తుంటాయ్. ఇక శాస్త్రజ్ఞుల బృందానికి, రహస్య దీవికి రక్షణగా కావలసినంత సెక్యూరిటీ చైనానుండి తరలించబడినట్లు వార్తలొచ్చాయి.

అసలే దక్షిణ చైనా సముద్రం అంటే హిందూ మహా సముద్రంలా శాంతిమండలం కాదు. ప్రతిక్షణం ప్రమాదా లతో కూడుకున్న సముద్రమది. తుఫానులకు మరో పేరది. ప్రపంచంలో కెల్లా ప్రమాదమైన సముద్ర జంతువులకు నిలయం. వీటికి తోడు చైనీస్ నావల్ ఫోర్స్.

మామూలు పరిస్థితులలోనే హాంకాంగ్ నుంచి సింగ పూర్ దాకా చైనీస్ వార్ షిప్స్ పిచ్చికుక్కల్లా తిరుగు తుంటాయ్. ఈ అణ్వస్త్రాలు తయారు చెయ్యటం మొదలై నప్పటినుంచీ వాటి జాడ మరింత పెరిగింది. ఈ పరిస్థితిలో

దక్షిణ చైనా సముద్రంలో అడుగు పెట్టడం అంటే కోరి మృత్యువును ఆహ్వానించినట్లే. అయినా తప్పదు!

సింగపూర్ స్మగ్లింగ్ కేంద్రంగా ప్రసిద్ధి చెందటం ఒక రకంగా నాకెంతో ఉపయోగించింది. డాలర్ చేతిలో ఉంటే ఏ అవసరమైనా తీరుతుందక్కడ. దొరకని వస్తువంటూ ఉండదు.

అలాగే కొనగలిగాను నాక్కావలసిన వెపన్స్ దగ్గర నుండి ఎలక్ట్రిసిటీతో నడిచే ఈ 'గుడ్ లక్' మోటర్ బోటు దాకా.

విద్యుచ్ఛక్తి సహాయంతో ప్రయాణించే ఈ మోటర్ బోటుకు పెట్రోలు అనవసరం. తనకి కావలసిన విద్యుచ్ఛక్తినంతా సూర్యుడి నుంచే సమకూర్చుకొంటుంది. పగలంతా సూర్యరశ్మి నుంచి సేకరించిన విద్యుచ్ఛక్తి నిల్వ ఉంచుకొని రాత్రివేళల్లో ఉపయోగించు కొంటుంది.

మోటర్ బోటు వుపరిభాగం మీద అమర్చబడిన పళ్లెముల వంటి నాలుగు సూర్య విద్యుద్ఘట మాలలు సూర్యరశ్మిని సరాసరి విద్యుచ్ఛక్తిగా మార్చి తద్వారా బోటులోని మోటారును నడుపుతాయ్. అంతే కాక వీటిద్వారా ఇతర పనులకు, మంచి నీటిని పట్టుటకు ఉపయోగించుకోవచ్చును.

ఏదేమైనా పెట్రోలు అవసరంలేని ఈ విద్యుత్ మోటరు బోటుతో ఎన్నాళ్ళయినా ఈ సముద్ర జలాలలో వెదుకులాట సాగించవచ్చు. కాని వున్న వ్యవధి తక్కువ. ఎంత త్వరగా ఆ దీవిని కనుక్కొంటే అంత మంచిది.

గదిలో వక మూల నిశ్చలంగా నిలబడి ఉంది. 'బాతిస్కాప్.' గుండ్రంగా పెద్ద గోళంలా ఉంది. దీన్లో ఇద్దరు

కూర్చొని సముద్ర గర్భంలో ప్రయాణం చెయ్యవచ్చు. చిన్న సైజు సబ్ మెరైన్ అనవచ్చు దీనిని.

చేతిలో అయిపోవచ్చిన సిగరెట్ ను విసిరి కొట్టాను. మరోటి ముట్టించుకో బోతుండగా డెక్ పైనుంచి క్రిందికు దూసుకొచ్చాడు కంగారుగా త్రినాథ్. అతని మెడలో బైనాక్యులర్స్ వ్రేళ్లాడుతోంది.

"వాట్ హేపెండ్!" ఆత్రంగా అరిచాను.

కిటికీలోంచి ఒకవైపు వ్రేలు చూపిస్తూ బైనాక్యులర్స్ అందించాడు నా చేతికి. బైనాక్యులర్స్ కళ్ళ ముందుంచు కొని అతను చూపించిన వైపు చూసి ఉలిక్కి పడ్డాను.

దూరం నుంచి ఏదో గన్ బోట్ మా వైపు దూసు కొస్తూంది. దాని డెక్ మీద నిలబడి ఉన్న నలుగురైదుగురు సోల్జర్స్ నలకల్లా కన్పిస్తున్నారు.

"మైగాడ్...అప్పుడే ప్రమాదం ఎదురవ్వ బోతోం దన్న మాట." అన్నాను.

ఫిషర్ బైటకు పరుగెత్తుకొచ్చాడు. చకచకా అతనికి చేయవలసినదంతా చెప్పాను. అరనిముషంలో పల్లెవాళ్ళలా తయారయ్యాము.

డజను గ్రెనేడ్ లు, రివాల్వర్ లు మెషిన్ గన్ అందించాను. డెక్ నిండా త్రాళ్ళు వలలు పరచబడి ఉండటంతో వాటిక్రింద దాచబడిన వెపన్స్ పైకి కన్పించవు.

బాతిస్కోప్ పై టార్పాలిన్ కప్పి, లాబింగ్ పాడ్లు తీసుకొని ఇంజన్ రూంలోనికి నడిచాను. సైడ్ విండోస్ ప్రక్కగా లాబింగ్ పాడ్లు అమర్చాను.

షాట్ గన్ అందుకొన్నాను. అది రెమింగ్ టన్ పంప్ యాక్షన్ కార్బన్ 30/06 అమ్యూనిషన్ కు అనువైన

ఛాంబర్ అమర్చబడి ఉంది. క్షణానికో రౌండ్ బైటకు పంపగలదు.

పాట్ గన్ కు టెలిస్కోప్ తగిలిస్తుండగా క్రిందకు దిగివచ్చారు యిద్దరూ.

గుడ్ లక్ సాఫీగా ప్రయాణం సాగిస్తోంది. కిటికీలోంచి తల కొద్దిగా బైటపెట్టి చూసాను. దగ్గర కొచ్చేసింది గన్ బోటు.

రెడ్ కలర్ గన్ బోట్ అది. దానిపై చైనా దేశపు జాతీయపతాకం ఎగురుతోంది. ఆ బోటు కమర్చబడిన గన్ చూడగానే, నా గుండెలు జలదరించాయ్.

ఐదంగుళాలుంటుందని అంచనా వేశాను. అంటే అది యుద్ధనావ ప్రమాణంలో పెద్దది కాదుకాని గుడ్ లక్ లాంటి బోట్లను అరక్షణంలో నాశనం చేయడానికి అది చాలు.

'ధన్' మంటూ గన్ ప్రేలింది. చైనా సముద్రపు గాలిలో ప్రతిధ్వనించింది శబ్దం. ఫిషర్, ఏజంట్ ఎక్స్-5 డెక్ పైకి పరుగుతీసారు. టెలిస్కోప్ అమర్చిన పాట్ గన్ బారల్ కొద్దిగా బైటకు నెట్టి చూడసాగాను.

బోటు ఆపాను, కాని ఏ క్షణంలోనైనా ముందుకు దూకించటానికి ఇంజన్ రెడీగా ఉంచాను.

చైనీస్ గన్ బోట్ గుడ్ లక్ కు వందగజాల దూరంలో ఆగింది డెక్ పైకి చకచకా పరిగెత్తుకొచ్చారు అరడజను మంది సోల్జర్స్. వాళ్ళ చేతిలో మెషిన్ గన్స్ ఫిషర్, ఏజంట్ ఎక్స్-5 ల వైపు ఆకలిగా చూస్తున్నాయ్.

నేవీ ఆఫీసర్ వేషంలో ఉన్న చైనీ ఠీవిగా డెక్ పైకి వచ్చాడు. వాడి చేతిలో లౌడ్ స్పీకర్ వ్రేళ్ళాడుతోంది.

రాగానే బైనాక్యులర్స్‌తో రెండు నిముషాలు పరీక్షగా చూసాడు గుడ్‌లక్ వైపు. బారల్ ప్రక్కనున్న లాక్కొని విండో వెనక్కి నక్కాను. గన్ దగ్గర కూర్చొన్న ఇద్దరు సోల్జర్స్ దృష్టి ఇంజన్ రూం వైపు ఉంది. ఊపిరి బిగబట్టాను.

ఫిషర్ వైపు తిరిగాడు చైనీ. మైక్ నోటి దగ్గర పెట్టుకొని అడిగాడు.

"ఎవరు మీరు?"

ముఖాలు చూసుకొన్నారు ఫిషర్, ఏజంట్ ఎక్స్-5.

"ఫిషర్ మెన్" సమాధాన మిచ్చాడు ఎక్స్-5.

"ఐ. సీ. ఇంకెంత మందున్నారు లోపల?"

"ఎవరూ లేరు, మేమిద్దర మే!" అన్నాడు ఫిషర్.

అతని గుండె వేగం హెచ్చింది.

"రాస్కెల్స్ నిజం చెప్పండి! ఇంకెంత మందున్నారు లోపల?" కోపంగా అరిచాడు చైనీస్ అధికారి.

"నిజం. మేమిద్దర మే!"

సూటిగా చూసాడు ఇద్దరి వైపు ఓసారి.

"ఎందుకొచ్చారు ఇంత దూరం?" అడిగాడు.

"చేపలు పట్టడానికి." వల చూపించాడు ఫిషర్.

విచిత్రంగా నవ్వాడు చైనీ.

"ఇడియట్... చేపలు పట్టడానికి హార్బర్ నుంచి యాభై మైళ్ళ లోపలికి వచ్చారా? అదీ ఎలక్ట్రిక్ మోటర్ బోటులోనా? ఎవరిని నమ్మిద్దామనుకున్నావ్" పళ్ళు కొరుకుతూ అరిచాడు.

ప్రక్కనున్న సోల్జర్‌కు సైగ చెయ్యగానే వాడు లోనికి పరిగెత్తాడు.

చైనీస్ గన్ బోట్ గుడ్ లక్ వైపు కదిలింది. మెషన్ గన్స్ పట్టుకొన్న సోల్జర్స్ దృష్టి నా అనుచరుల మీదే ఉంది.

అటూ ఇటూ చూస్తున్న నేవీ ఆఫీసర్ ఉలిక్కి పడ్డాడు. అతని దృష్టిలో ఇంజన్ రూంలోని విండో లోంచి తొంగి చూస్తున్న 'షాట్ గన్' బారల్ పై నిల్చింది.

"ఫైర్" అంటూ గొంతు చించుకొని అరిచాడు. గన్ బోట్ ఆగిపోయింది. సోల్జర్స్ చేతిలోని మెషిన్ గన్స్ మొరిగాయ్.

ఊపిరి ఆగి పోయినట్లనిపించింది. సందేహించకుండా కిటికీలోంచి బైటకు తలెట్టి ఆర్మ్ గన్ ఫైర్ చెయ్యబోతున్న ఇద్దరు సోల్జర్స్‌ను కాల్చేశాను.

'గుడ్ లక్' నా ఆధ్వర్యంలో ముందుకు దూకింది ఏజంట్ ఎక్స్-5 గ్రినేడ్ విసిరాడు కాబోలు వెళ్ళి డెక్ పై పడింది. పెద్ద విస్ఫోటంతో బాటు సోల్జర్స్ శరీరా ల్లోంచి మాంస ఖండాలు చెక్కలతో కలిసి గాల్లో కెగి రాయ్.

గన్ బోట్ వెనక భాగమంతా నాశనమయింది.

నేవల్ ఆఫీసర్ మరో నలుగురైదుగురు కమాండర్స్ వార్ గన్ వద్దకు పరుగు తీసారు. ఫిషర్ మహోత్సా హంతో మెషిన్ గన్ కాలుస్తున్నాడు.

'ధన్' మంటూ ప్రేలింది వార్ గన్. మెరుపులా ప్రక్కకు త్రిప్పాను. అడ్డంగా తిరిగి ముందుకు దూకింది గుడ్ లక్.

ఫైర్ బాల్ బోటు అంచుకు రాసుకొంటూ దూసుకు పోయింది.

మరోసారి గన్ ప్రేల్చేలోగా లాబింగ్ వీల్ త్రిప్పాను. 'సర్' మంటూ మండుతూ వెళ్ళి గన్ బోట్ ను తాకింది రాకెట్.

చిన్న సైజు బాంబులా ప్రేలింది చైనీస్ నావల్ బోటు. రెండు నిముషాలు సముద్రంలో కలవరం చెలరేగింది. క్రమంగా సద్దుమణిగి ఎప్పటి ప్రశాంతత అలుముకొంది.

తృప్తిగా నిట్టూర్చాను. మొదటి ప్రమాదం గడిచింది. సూర్యుడు నడినెత్తికొచ్చాడు.

క్రిందకి వచ్చారిద్దరూ. బోట్ సరిచేసి, కండిషన్ చెక్ చేసి కాబిన్ లోకి వెళ్ళాను.

నవ్వుతూ నా అరచేయి ముద్దుపెట్టుకొన్నాడు ఏజంట్ ఎక్స్-5. తిరిగి మేమిలా కల్సుకొంటామని అనుకొని ఉండడు బహుశా.

"ఒన్ గ్రెనేడ్ అండ్ ఒన్ రాకెట్! బస్." అన్నాడు.

"అదేమిటి? ఫిషర్ చేతిపై గాయం?" అడిగాను.

"మెషిన్ గన్ బులెట్ దిగబడింది." అన్నాడు నైఫ్ తో ఫిషర్ వైపు కదులుతూ.

"ఆ పని నేను చూస్తాను. నువు కుకింగ్ చూడు!" అంటూ నైఫ్ అందుకున్నాను.

"ఓ. కె. బాస్." కుక్కర్ వైపు కదిలాడు ఏజంట్ ఎక్స్-5.

2

రెండు రోజులు గడిచాయ్. హాంకాంగ్ వైపు సుమారు ఐదువందల నాట్స్ దూరం ప్రయాణం సాగించాము. కాని ఏవిధమైన ఆధారం దొరకలేదు.

గంట ఏడయింది. అప్పటి వరకూ దక్షిణ చైనా సముద్రాన్ని దట్టంగా ఆవరించుకొని ఉన్న పొగమంచు తీక్షణమైన సూర్యకిరణాలకు విడిపోయి సముద్రం యథా తథంగా నీలరంగును సంతరించుకొంది.

ఏజంట్ ఎక్స్-5 అందించిన కాఫీ త్రాగి సిగరెట్ వెలిగించాను. చలిచలిగా వున్న వాతావరణంలో వెచ్చదనాన్ని అందించింది పొగ లోనికి వెళ్తూ.

"గుడ్ మార్నింగ్ బాస్!" అంటూ కాబిన్ లోకి వచ్చాడు ఫిషర్.

"వెరీ గుడ్ మార్నింగ్!" అన్నాను చిన్నగా నవ్వి. ఎక్స్-5 అందించిన కప్పు అందుకొన్నాడు ఫిషర్.

"ఇక బయలుదేరదామా?" అడిగాడు.

తెల్లవారుజాము సముద్రంపై దట్టమైన పొగమంచు ఆవరించుకొని వుండటంవలన ప్రతీ రాత్రీ మూడు గంటలకే ప్రయాణం ఆపెయ్యవలసి వస్తోంది. తిరిగి పొగమంచు విడిపోయే దాకా కదలటానికి వీలులేకపోవటంతో అనవసరంగా టైం వేస్ట్ అవుతోంది.

"మరో గంటలో బయలుదేరుదాం" అన్నాను కుర్చీ లోంచి లేస్తూ.

"ఓ.. కె." అని ఇంజన్ రూంలోకి వెళ్ళాడు ఫిషర్. "కమాన్ ఫ్రండ్" ఏజంట్ ఎక్స్-5 ను ఉద్దేశించి అంటూ 'బాతిస్కోప్' వైపు కదిలాను.

ఇద్దరం కలిసి 'బాతిస్కోప్'ను నీటిలోనికి చేరవేసి లోనికి ప్రవేశించాం. విండోలోంచి చూస్తూన్న ఫిషర్ వైపు చెయ్యి ఊపి ఇంజన్ స్టార్ట్ చేసాడు ఏజంట్ ఎక్స్-5.

నెమ్మదిగా సాగర గర్భంలోకి దిగసాగింది 'బాతిస్కోప్'. చుట్టూ ఉన్న అద్దాలలోంచి సముద్ర జంతువులు కన్పిస్తున్నాయ్.

పెద్ద గోళంగా ఉన్న 'బాతిస్కోప్' వేగంగా సాగర గర్భంలోకి దిగుతోంటే షార్క్ చేపలు తమ బలమైన తోకలతో చుట్టూ ఉన్న అద్దాలను మోద సాగాయి.

సముద్ర గర్భంలో కన్పిస్తున్న ఆ ప్రకృతి దృశ్యాలు ఆహ్లాదకరంగా ఉన్నాయ్.

రకరకాల చేపలు, ఎండ్రకాయలు, చిన్నసైజు ఆక్టోపస్‌లు, స్క్విడ్‌లు, వేల్స్ గ్లాస్ ఏంజిల్స్ మొదలైన సముద్ర ప్రాణులు హడావిడిగా అటూఇటూ కదులుతున్నాయ్.

దగ్గరలోనే సముద్ర పాచి (స్పంజ్) దట్టంగా పేరుకొని ఉంది. 'ఈగల్ రే', 'ఇంద్రధనస్సు' చేపలు స్పంజి పొద కదులుతూ ఒకదానినొకటి గుద్దుకొంటున్నాయ్.

"విజయ్...ఎలక్ట్రిక్ ఈల్" అకస్మాత్తుగా అరిచాడు ఏజంట్ ఎక్స్-5.

అటువైపు చూసాను.

మెలికలు తిరుగుతూ సముద్రోపరితలం వైపు సాగుతోంది ఎలక్ట్రిక్ ఈల్. దాని శరీరంనుంచి చిన్నచిన్న మెరుపులతో విద్యుచ్ఛక్తి ఉద్భవిస్తోంది.

సాధారణంగా ఈ ఎలక్ట్రిక్ ఈల్స్ సముద్రం పైభాగానికి రావు.

సముద్ర మట్టానికి 350 అడుగుల లోతువరకూ సూర్యకాంతి ప్రసరిసుంది. ఆ పైన 1500 అడుగుల లోతు

వరకూ మసక వెలుతురు ఆక్రమించి ఉంటుంది. అక్కడి నుండి అంతా గాఢాంధకారం.

అంత లోతున వృక్షజాతులేవీ ఉండవు. కారణం అక్కడి పీడనం అమితభారంగా ఉంటుంది. ఆ పీడనానికి తట్టుకో గలిగేవి అతితక్కువ ప్రాణులు మాత్రమే.

ఆ అంధకారంలో తమకు కన్పించటానికి అక్కడ ఉండే ప్రాణులు తమ కాంతిని తామే ఉత్పత్తి చేసు కొంటాయ్.

అటువంటి జాతికి చెందినవే ఈ ఎలక్ట్రిక్ ఈల్స్, స్క్విడ్‌లు.

"ఎంత లోతులో ఉన్నామో చూడు!" అన్నాను ఏజంట్ ఎక్స్-5 తో.

"230 అడుగులు" బరోమీటర్ చూస్తూ అన్నాడు.

"గుడ్ మరో రెండువందల అడుగుల లోతుదాకా వెళ్ళి వెనక్కి తిరుగుదాము," అంటూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసాను.

"హేయ్...పగడపు గుత్తులు, పగడాలు" అరిచాడు ఏజంట్ ఎక్స్-5. కనుచూపు మేరంతా పగడపు గుత్తులు కన్పిస్తున్నాయ్.

మా ప్రయాణంలో ఇదే మొదటిసారి నేను పగడాలను చూడటం. మేము మొదటి రెండు రోజులు సాగర గర్భంలో తిరిగాము కాని ఎక్కడా ఒక్క పగడపు గుత్తి కూడా కన్పించలేదు.

అన్ని పగడాలు వకేసారి కంటపడేసరికి ఆశ్చర్యంతో నోట మాటరాలేదు నాకు.

'సముద్రంలో ఉన్న బంగారమంతా వెలికి తీయ గలిగితే భూమ్మీద ప్రతీ మనిషికీ 9 పౌనుల బంగారం పంచిపెట్టొచ్చు' అన్న ఎవరో సైంటిస్ట్ మాటలు గుర్తు కొచ్చాయి.

బాతిస్కోప్ ఆపెయ్యగానే నిశ్చలంగా నీటిలో నిలిచిపోయింది.

చకచకా స్కూబా సూట్ తీసి తొడుక్కొన్నాను. ఆక్సిజన్ సిలిండర్ వీపుకు తగిలించుకొని 'యారోగన్', (వాటర్ రైఫిల్) 'సీటార్చి' తీసుకొన్నాను.

వాటర్ ప్రూఫ్ బాగ్ భుజానికి తగిలించుకొని ఏజంట్ ఎక్స్-5కు వీడ్కోలిచ్చి, సీ డోర్ ద్వారా బయట పడ్డాను.

ఒక్కక్షణం జల్లుమంది వళ్ళు. ముందుకు ఈదు కొంటూ వెళ్ళి బాగా పగడాలు ఎక్కువున్న గుత్తుల నల్లా ఏర్ బాగ్‌లో వేయసాగాను. అరగంటలో బాగ్ నిండింది.

రకరకాల చేపలు తాపీగా హడావిడిగా తిరుగు తున్నాయ్. వెనుతిరిగి బాతిస్కోప్ వైపు బయలు దేరాను. కాలిక్రింద రాయి గట్టిగా తగిలింది. ఏదో కొండ నేనున్న స్థలంనుంచి ఏటవాలుగా పైకి చొచ్చుకు పోయింది.

ఎగుడు దిగుడుగా ఉన్న ఆ రాళ్ళపై నడుస్తోంటే చాలా వింతగా ఉంది. శూన్యంలో కదులుతున్నట్లుంది.

ప్రక్కనుంచి ఏదో జంతువు ఈదుకొంటూ వెళ్ళింది. దానివైపు చూడగానే గుండె ఆగినంత పనైంది. నలభై అడుగుల పొడవున్న రంపపు చేప అది.

బాతిస్కోప్ సమీపానికి చేరాను. ప్రీవ్యూ మిర్రర్స్ లోంచి చూస్తున్న ఏజంట్ ఎక్స్-5 చెయ్యి ఊపాడు.

నవ్వుతూ ముందుకడుగు వేసి బాధగా అరిచాను. చూసుకోకుండా 'సీ అర్చిన్'పై కాలు వేయటంతో రబ్బర్ షూస్‌ను చీల్చుకొని కసిగా కాలిలో జారబడ్డాయి ముళ్ళు.

వెనక్కి లాక్కున్నాను కాలు. విషప్రభావం వల్ల నాలో మార్పు ఏర్పడుతోంది. రెండు ముళ్ళు కాలిలో విరిగాయ్.

'సీ అర్చిన్' ముళ్ళలో చిన్న పిల్లల్ని తేలికగా చంపగలిగే శక్తిగల విషం ఉంటుంది. ప్రాణానికి మోసం తప్పినా బాధ తప్పలేదు.

సీ అర్చిన్ ముళ్ళు విచ్చుకొని పైకి లేస్తోంది. ట్రిగ్గర్ లాగాను. 'యారో' అర్చిన్ శరీరాన్ని ఛేదించింది.

నా శరీరంలోంచి బైటకువస్తున్న రక్తం సముద్రపు రంగును మార్చింది. ఆ రంగు క్షణాలలో వేటిని అక్కడకు తీసుకొస్తుందో నాకు తెలుసు. కంగారుగా బాతిస్కోప్ వైపు కదిలాను.

రక్తపు వాసన పసిగట్టిన రెండు పెద్ద హ్వేల్ చేపలు అక్కడకు దూసుకొచ్చాయి.

భయంకరంగా నోరు తెరిచి మెరుపు వేగంతో నాపై దాడిచేశాయి అవి. ఒక హ్వేల్ చేప తన తోకతో కొట్టిన దెబ్బకు స్కూబాసూట్ చిరిగి పీలికలయింది.

గిజగిజలాడి పోయాను బాధతో. రక్తంలో ప్రెషర్ ఎక్కువై ఏ క్షణాన్నైనా శరీరాన్ని చీల్చుకొని బైటకొచ్చేసేలా ఉంది. హ్వేల్ చేప పళ్ళు నా భుజంలో లోతుకు దిగబడ్డాయి.

మరోసారి అవి నన్ను సమీపించేలోగా ఉండలా చుట్టుకుపోయి కొంచెం క్రిందకు జారాను. 'యారో గన్' నిశ్శబ్దంగా మొరిగింది. నాలుగు యారోలు హ్వేల్ చేపల శరీరాలలో దూరాయ్.

షార్క్ చేపల మంద అటువైపు దూసుకొస్తూంది. కదలటానికి ప్రయత్నించాను. కాని రక్తం విపరీతంగా స్రవించి, శక్తి పూర్తిగా క్షీణించి పోటంతో అక్కడి నుంచి కదలలేక పోయాను.

ఇంతలో బాతిస్కాఫ్ వేగంగా వచ్చి నా ప్రక్కకు చేరింది. సీడోర్ లోంచి ఏజంట్ ఎక్స్-5 నన్ను లోనికి లాగేశాడు.

ఐదు నిముషాలకు గాని తేరుకోలేక పోయాను. రక్త వర్ణపు నీళ్ళలో అర్చిన్, హ్వేల్స్‌ల మృతదేహాల చుట్టూ కుమ్ములాడు కొంటున్నాయి షార్క్స్.

గట్టిగా నిట్టూర్చి ఏజంట్ ఎక్స్-5 వైపు చూశాను. నిశ్చలనంగా ప్రీవ్యూ మిర్రర్స్‌లోంచి బైటకు చూస్తున్నాడు. బాతిస్కాఫ్ సముద్రోపరితలం వైపు కదులుతోంది.

3

రాత్రి పదిగంటలయింది. ఇంజన్ రూం ఫిషర్‌కు అప్పగించి డెక్ పైకొచ్చాను.

చల్లగా వస్తోంది గాలి. ఆకాశంలో తారకలు మెరుస్తోన్నాయ్. గుడ్‌లక్ ముందు భాగంలో అమర్చబడిన ఫ్లాష్‌లైట్ చీకటిని పారద్రోలుతూ పరిసరాలను ప్రకాశవంతం చేస్తోంది.

చిన్నగా శబ్దం చేస్తూ వేగంగా ముందుకు పోతోంది బోట్. విశ్రాంతిగా డెక్‌పై పడుకొని ఆలోచనలో

పడ్డాను. రాత్రి ఒంటిగంటయినా నిద్ర రావటం లేదు.

పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సముద్రం మీద బైలుదేరి అప్పుడే పదిహేను రోజులౌతోంది. ఈ పది హేను రోజులలో దాదాపు అర డజను ప్రమాదాలు ఎదురయ్యాయి. ఇంకా మిగిలిన సమయం పదిహేను రోజులు మాత్రమే.

ఈ పదిహేను రోజుల్లో దాదాపు 2500 నాట్ మైళ్ళ ప్రయాణం జరిగింది. "హైనాన్, హాంకాంగ్, వేహోగ్, తైవాన్, మణిలా"ల మధ్య భాగం క్షుణ్ణంగా పరిశీలించాను.

ఫలితం లేకపోవటంతో ప్రయాణం 'టూరేన్'ల వైపు మార్చుకోవలసి వచ్చింది.

నా అనుమానం 'నాట్రాంగ్, నటూనా ద్వీపమంజరి' మధ్యనున్న దీవులపై దృఢంగా నిల్చింది. అన్ని విధాల ఆటమిక్ ఆపరేషన్కు ఆ దీవులే ఉపయో గిస్తాయ్. కాని మిగిలిన పది రోజులలో ఆ దీవిని తెల్సుకోగలనా అనే సందేహం బాధిస్తోంది.

సీ అర్చిన్, హ్వేల్ చేపలు చేసిన గాయాలు చాలా వరకూ మానాయ్. అప్పటివరకూ ప్రయాణంలో ఎదు రైన క్రూర సముద్ర జంతువులను తల్చుకొంటే అసహ్యం పుడుతోంది.

"డర్టి సీ... —" కసిగా తిట్టుకొన్నాను.

"బాస్..." అరిచాడు ఇంజన్ రూంలోంచి ఫీషర్. ఆ అరుపులోని ప్రమాదం పసిగట్టిన నా గుండెలు వేగంగా స్పందించాయ్.

లేచి నిలబడ్డాను. ప్రమాదం అర్థమైంది,

రెండు ఫర్లాంగుల దూరంలో సముద్రంలో పెద్ద పెద్ద కెరటాలు పైకి లేస్తోన్నాయ్. నీళ్లు వెల్లుతున్నాయ్ పైకీ క్రిందకూ.

సముద్రం పొంగుతున్నదేమో అనుకున్నాను కాని నా ఊహాకు విరుద్ధంగా ఏదో ఆకారం ఎగిరెగిరి పడుతున్న కెరటాల మధ్యనుంచి లేస్తోంది.

ఆ జంతువేమిటో గుర్తుపట్టాను. 'ఆక్టోపస్'. 'పార్పాయిస్' మీద రెట్టింపు ఉంది. ఏనుగు తొండాల్లాంటి పాదాలు అనేక వందలున్నాయ్.

ఆక్టోపస్ శరీరంనుంచి రెండు నీటి ధారలు ఆకాశంలోకి మంచి ఎతున లేచాయ్. నీటిలో మునుగుతూ తేలుతూ ఎగురుతోందా జంతువు.

'గేజిర్' అన్నాను అప్రయత్నంగా ఆ నీటి ధారను చూస్తూ. ఐస్ లాండ్ లో 'హెక్లా' పర్వతం దగ్గర ఎదురైన 'గేజిర్' గుర్తొచ్చి. అయిస్‌లాండిక్ లో గేజిర్‌కు అర్థం 'జలప్రపాతం.'

గుడ్ లక్ దిశమార్చి పోనిస్తున్నాడు ఫిషర్. ఆక్టోపస్ వెంటబడింది.

ఈ సముద్రంలో 'పార్పాయిస్' లంతటి 'ఆక్టోపస్'లు ఎదురౌతాయని కల్లోకూడా ఊహించలేదు.

క్రిందకు పరిగెత్తాను. ఏజంట్ ఎక్స్-5 వణికిపోతూ కాబిన్ లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఫిషర్ పరిస్థితి ఊహించుకోగలను.

"విండోస్ లాక్ చెయ్యి వేగంగా;" అరుస్తూ వెపన్స్ వైపు పరుగెత్తాను. చకచకా బీరువా తెరిచి 'ఫైర్ గన్', సిలిండర్స్ తీసుకొని భుజానికి తగిలించుకొంటుండగా చావు కేక వేసాడు ఏజంట్ ఎక్స్-5.

అదిరిపోతూ చూసాను. ఆక్టోపాస్ తోకల్లో ఒకటి కిటికీలోంచి లోనికి ప్రవేశించి ప్రక్క విండో లాక్ చేస్తున్న ఏజంట్ ఎక్స్-5 శరీరాన్ని చుట్టుకొంది.

గింజుకొంటున్నాడు ఎక్స్-5. పొడుగైన రంపం లాంటి వెపన్ అందుకొని అతని దగ్గరకు పరిగెత్తాను.

కిటికీలోంచి బైటకు లాగుతోంది ఆక్టోపస్. రంపంతో దాని పొదాన్ని క్షణాలలో తెగగొట్టాను.

మొండెం విండోలోంచి బైటకు పారిపోయింది. ఎక్స్-5 ను చుట్టుకొన్న తోక నేల మీద బల్లితోకలా మెలికలు తిరుగుతూ కొట్టుకొంటోంది.

మరో విండోలోంచి లోనికి ప్రవేశించాయి రెండు తోకలు.

ఫైర్ గన్ ఆన్ చేసాను, 'జుయ్' మంటూ దూసు కెళ్ళి వాటిని తాకింది ఫ్లేర్. మెలికలు తిరిగి ముడుచు కొంటూ బైటకు పారిపోయాయ్.

ఏజంట్ ఎక్స్-5 వైపు తిరిగాను.

"ఆయిల్ డ్రమ్స్ ఎక్కడున్నాయ్?" అడిగాను.

"కాబిన్ క్రింద." చెప్పాడు ఎక్స్-5.

గన్ అతనికి ఇచ్చాను. జాగ్రత్తగా కవర్ చేస్తూండు అంటూ కాబిన్ చివరికి నడిచాను. నేలపై ఉన్న కార్పెట్ ఎత్తి చెక్కలు ప్రక్కకి జరపగానే ఇనుప నిచ్చెన కన్పిం చింది. దిగాను.

పొడుగ్గా పడవ ఆ చివరి నుంచీ ఈ చివరి వరకూ నడ వాలా ఉందా గది. చిన్న చిన్న లైట్లు డిమ్‌గా వెలుగు తున్నాయ్. నాలుగైదు ఆయిల్ డ్రమ్ములు రెండు లైఫ్ బోట్లు అరడజను ట్యూబులు వక ప్రక్కగా ఉన్నాయ్.

ఒక డ్రమ్ ఓపెన్ చేసి క్రింద పడిఉన్న పెట్రోల్ డబ్బాలలో ఒక దాని నిండుగా పట్టాను. ఇంజన్ రూం లోంచి మెషిన్‌గన్ గొలుసులా ప్రేలుతోంది.

పైకొచ్చాను. లోపలికొస్తూన్న ఆక్టోపస్ పాదాలను కాల్చడంలో నిమగ్నుడై ఉన్నాడు ఏజంట్ ఎక్స్-5.

ఒక కిటికీ దగ్గరకు పరిగెత్తి ఆయిల్ సముద్రంలో వంచాను. బోటు ప్రక్కనే నీటిపై చారలా వలుకుతోంది ఆయిల్. ప్రక్కకు వచ్చాడు ఎక్స్-5.

'ఫ్లేర్' వెళ్ళి పెట్రోల్ డబ్బాను తాకింది. 'ధాం' అంటూ ప్రేలుతూ ఆయిల్ అంటుకొంది చరచరా పాదు గునా.

తృప్తిగా నిట్టూర్చాను. 'ఫ్లేర్' చూసి భయపడని సముద్ర జంతువేదీ లేదు.

ఇంజన్ రూంలోంచి చావుకేక పెట్టాడు ఫిషర్. మెషిన్‌గన్ మ్రోగటం ఆగిపోయింది.

లోనికి పరుగుతీసాం ఇద్దరం. గది నిండా తెగి ముక్కలు ముక్కలుగా పడిఉన్న ఆక్టోపస్ తోకలు గిలగిల లాడుతోన్నాయ్.

విండో వైపు చూసి అదిరిపోయాను. సుమారు అర డజను తోకలు ఫిషర్ శరీరం కన్పించకుండా చుట్టేసి బైటకు లాగుతోన్నాయ్.

స్పృహలో లేడు అతను. బైటకెళ్ళిపోయింది. ముందుకి కదలబోయాను. కాని చూస్తూండగానే బైటకెళ్ళి పోయాయి ఆక్టోపస్ తోకలు.

నిశ్చేష్టుడనై పోయాను. ఆక్టోపస్ ఫిషర్‌ని చిక్కించుకొని దూరంగా ఈదుకొంటూ పోతోంది.

అప్రయత్నంగా నా కళ్ళవెంట జల జలా నీళ్ళు రాలాయ్.

గట్టిగా నిట్టూర్చి డ్రైవింగ్ సీట్లోకి కదిలాను.

4

వాచీలో డేట్ ఏడుసార్లు మారింది. 'గుడ్ లక్' నటూనా ద్వీప మంజరి వైపు ప్రయాణిస్తోంది.

'గోల్డెన్ జోక్' విస్కీ సిప్ చేస్తూ దిక్సూచీ వైపు చూడసాగాను. వరల్డ్ మేప్ టేబిల్ పై పరచి ఉంది.

దిక్సూచీ ముళ్ళు దక్షిణం వైపు సూచిస్తోంది. చకచకా లెక్కలు కట్టాను. 'నాట్రూంగ్'కు నాలుగు వందల మైళ్ళ దూరంలో దక్షిణంగా 'నటూనా' వైపు ఉన్నాము.

నూట ఎనభై మైళ్ళ దూరంలో ఉంది ద్వీపమంజరి.

రెడ్ పెన్సిల్ తీసుకొని వరల్డ్ మాప్ పై నటూనా చుట్టూ సర్కిల్ గీసాను. మొత్తం పదమూడు ద్వీపాలు గుర్తింపులో కొచ్చాయ్. బోట్ ప్రయాణం చేస్తోన్న రూట్ కూడా 'యారోస్' రూపంలో గుర్తించాను.

అకస్మాత్తుగా ద్వీపమంజరికి కొంచెం ఎడంగా విసిరేసి నట్లున్న ఒక ద్వీపంపై నా దృష్టి నిల్చింది. చాలా చిన్న దీవి అది. ద్వీపమంజరికి ఎడంగా విశిరేసినట్లుండి కేవలం చుక్కలా మాత్రం గుర్తింప బడిందంటే బహుశా అందులో జనసంచారం ఉండి ఉండదు.

నా అనుమానం ఆ దీవి వైపు మళ్లింది. అవును! ఆ దీవే ఎందుకు కాకూడదు? అన్ని విధాలా అనుకూలంగా ఉన్న దీవి అది.

అటమిక్ ఆపరేషన్ సాగించటానికి దానికంటే అను వైన మరో దీవి పరిసరాలలో లేదు.

మరో విషయం గుర్తొచ్చింది నాకు. చైనీస్ నావల్ వార్‌షిప్స్ హాంకాంగ్ నుంచి బోర్నియోదాకా మొదట్లో సంచరించేవన్న విషయం మర్చిపోలేను ఎప్పటికీ.

అంటే ఈ విధంగా మధ్యలో నటూనా ద్వీపమంజరిని కవర్ చేసే ఉద్దేశ్యం అయి ఉండాలి.

లేచి ఇంజన్ రూంలోకి వెళ్ళాను. ఏజంట్ ఎక్స్-5 ప్రశ్నార్థకంగా చూసాడు.

"ఎంత స్పీడుతో వెళ్తోంది?" అడిగాను.

"టెన్ నాట్స్!"

"చాలదు, వేగం పెంచు సాయంత్రానికి నటూనా సమీపానికి చేరుకోవాలి." అంటూ బైనాక్యులర్స్ అందుకొన్నాను.

గుడ్ లక్ వేగాన్ని పుంజుకొంది.

డెక్ పైకి నడిచాను. చుట్టూ నీలి సముద్రం కనుచూపు మేరంతా కన్పిస్తోంది. ఆకాశంలో సూర్యుడు మండుతున్నా సముద్ర గాలులు చల్లదనానికి వేడి అన్పించటం లేదు.

నెట్ పై కూర్చొన్నాను. డెక్ అంచుచుట్టూ కవర్ చేస్తున్న ఇనుప ఊచలకు ఆనుకొని 'ఒమేగామాన్' బుక్ తెరిచాను.

పావుగంట గడిచింది.

ఏదో శబ్దాన్ని నా చెవులు పసిగట్టటంతో తలెత్తి చూసి ఉలిక్కిపడ్డాను. ఏదో ప్లేన్ హాంకాంగ్ వైపు నుంచి వస్తోంది.

పాసింజర్ ప్లేనేమో అనుకొన్నాను. కాని మరుక్షణం నా ఊహ తప్పని తేలింది. మామూలుగా ట్రావెలింగ్‌కు ఉపయోగించే ప్లేన్ కాదు అది. వార్‌లో ఉపయోగించే కాబర్ జెట్. అదెందుకు మా వైపు వస్తోందో అర్థమైంది.

క్రిందకు పరిగెత్తాను. ఏజంట్ ఎక్స్-5 కు అంతా రెండు ముక్కల్లో చెప్పాను.

అల్మైరా తెరిచి కావలసిన ఆర్మ్స్ తీసుకొని తిరిగి డెక్ పైకి వెళ్ళాను. ఫిషర్ లేని లోటు తెలుస్తోంది స్పష్టంగా.

రెండు లాబింగ్ పాడ్లు డెక్ పై అరేంజ్ చేసాను. రాకెట్స్ వాటిపై అమర్చి మెషిన్ గన్ నిండుగా అమ్యూనిషన్ నింపాను. టెలిస్కోప్ అమర్చి లాబింగ్ పాడ్ ల ప్రక్కనే బోర్లా పడుకొన్నాను. నెట్ నన్ను పైకి కన్పించకుండా కప్పలేదు.

శాబర్ జెట్ పెద్ద మోతతో నడినెత్తి పైకొచ్చింది. టెలిస్కోప్ లోంచి వేగంగా కదులుతున్న ప్లేన్ పై చైనీస్ ఎయిర్ ఫోర్స్ అక్షరాలు అస్పష్టంగా కన్పించాయ్.

ప్లేన్ లోంచి మొదటి బాంబు క్రిందకి ఉరికింది. ఒక్కసారిగా 'గుడ్ లక్' వేగం హెచ్చటంతో కొద్దిలో తప్పి నీటిని తాకింది.

చెవులు చిల్లులు పడేంత శబ్దం అయింది.

ముందుకు దూసుకు పోయిన 'శాబర్ జెట్' వెనక్కి తిరిగి బోట్ వైపు బయలుదేరింది.

నా గుండెలు దడదడ లాడాయ్.

బహుశా ఏజంట్ ఎక్స్-5 ఎంతోసేపు ప్లేన్ బారి నుంచి బోట్ ను కాపాడలేడనిపించింది. ఎంత త్వరగా ప్లేన్ ను నాశనం చేస్తే అంత మంచిది.

సమయం గడిచే కొద్దీ ఏజంట్ ఎక్స్-5 లో ఆత్మవిశ్వాసం నశించి బోట్ నడపడంలో తడబడవచ్చు.

ఏమాత్రం తప్పటడుగు వేసినా బోటుతో కలిసి నామ రూపాలు లేకుండా పోతాము. శాబర్ జెట్ మళ్ళీ బాంబు

వదిలింది. దేవుడిపై భారం వేసి ట్రిగ్గర్ నొక్కాను. గొలుసులా వెళ్ళాయ్ బులెట్స్ కాని గురి తప్పి ఆకాశంలోకి దూసుకొని పోయాయి.

బాంబు బోటును తాకుతుందనగా అడ్డంగా కోసాడు ఏజంట్ ఎక్స్-5. జర్క్ ఇచ్చి ప్రక్కకు దూకింది గుడ్ లక్.

బోట్ ప్రక్కనే పడింది బాంబ్. నీటిపై మెరుపు మెరిశింది. నెట్ కొసలు చెవుల్లో కుక్కుకొన్నాను. నీరు పెద్ద కెరటంలా లేచి డెక్ నంతా తడిపింది.

వెనుతిరిగింది శాబర్ జెట్. ఒక్క క్షణం ఆలోచించాను. మెషన్ గన్ తో శాబర్ జెట్ ను ఎదుర్కోలేనని పించింది.

చకచకా పది డిగ్రీల తేడాతో లాబింగ్ పాడ్స్ బిగించాను. ఒకటి 90 డిగ్రీల కోణంలో నిట్టనిలువుగా ఉంది. దానికి పది డిగ్రీలు తేడాలో మరొకటి.

శాబర్ జెట్ గుడ్ లక్ ను సమీపించింది. సరిగా బోటు మధ్యకు రావటానికి కొద్ది డిగ్రీల తేడాలో ఉండగా రాకెట్ ను వదిలాను. వెంటనే మరొకటి.

శాబర్ జెట్ క్షణంలో ఎంత వేగంతో ప్రయాణిస్తుందో నాకు తెల్సు. లాబింగ్ వీల్ త్రిప్పాక టార్జెట్ ను రాకెట్ తాకడానికి కొద్ది టైము కావాలి.

ఆ సమయంలో కొద్ది డిగ్రీల తేడాలో ఉన్న ప్లేన్ బోట్ మధ్యకొస్తుంది. ఇదీ నా ఉద్దేశ్యం.

రాకెట్స్ వదలగానే గన్ ఫైర్ చేసాను. మొదటి రాకెట్ మిస్ అయింది.

వార్ ప్లేన్ లోంచి బైటకొచ్చిన గ్రినేడ్ ను పది డిగ్రీల తేడాలో రెండోసారి కాల్చిన 'మిసైల్' వెళ్ళి

తాకింది.

ఆకాశంలో ప్రేలాయి రెండూ. అంతలోనే అను కోని సంఘటన జరిగిపోయింది. రాకెట్స్ పై ఆశలు పెట్టుకొని మిషన్ గన్‌ను గుడ్డిగా కాల్చినా అదృష్ట వశాత్తు వెళ్ళి బోట్‌ను దాటుతోన్న వార్ ప్లేన్ లెఫ్ట్ వింగ్‌ను తాకింది.

టప్ మంటూ ప్రేలి లెఫ్ట్ వింగ్ అంటుకొంది.

ఈసారి శాబర్ జెట్‌ను స్మాష్ చేయడం అంత కష్టం కాలేదు.

మెషిన్ గన్ వదిలేసి లాబింగ్ పొడ్లపై 'మిసైల్స్' బిగించి ఆకాశంలో మండుతూ వెనక్కి తిరుగుతున్న ప్లేన్ వైపు చూడసాగాను.

హాంకాంగ్ వైపు తిరిగింది ప్లేన్. వ్యూలోకి వచ్చేదాకా ఊర్కొని రాకెట్స్ ఫైర్ చేశాను.

ఉత్తరంగా 135 డిగ్రీల కోణంలో రెండూ ఎర్రగా మండుతూ వెళ్ళాయ్.

అర నిముషం తరువాత ఆకాశంలో టపాకాయలా ప్రేలింది శాబర్ జెట్.

గట్టిగా ఊపిరి పీల్చాను. పరిగెత్తుకొంటూ డెక్ పై కొచ్చాడు ఏజంట్ ఎక్స్-5.

నవ్వుతూ అతనివైపు చూసాను. "విజయ్...యూ ఆర్ ఏ జీనియస్ ఇన్ అవర్ స్పైస్!" నా చెయ్యి ఊపేస్తూ అరిచాడు.

ఇద్దరం క్రిందకి వెళ్ళాం. కాబిన్ చేరుకోగానే ఏజంట్ ఎక్స్-5కు గుడ్‌బై కొట్టి బెడ్ పై పడ్డాను.

రాత్రంతా నిద్రలేక పోవటంతో కళ్ళు వెంటనే మూతలు పడ్డాయ్.

5

ఏజంట్ ఎక్స్-5 లేపడంతో మెలకువవచ్చి కళ్ళు తెరిచాను. లేచి కూర్చొని సిగరెట్ అందుకొంటూ వాచి చూసుకున్నాను. సాయంత్రం ఐదయింది.

"నటూనా చేరుకొన్నామా?" అడిగాను.

"ఇంకా లేదు" అన్నాడు ఎక్స్-5. అతని కంఠంలో కలవరాన్ని పసిగట్టాను.

"వాట్ హేపెండ్?" అడిగాను అతని ముఖంలోకి చూస్తూ.

"బయట క్లైమేటేమీ బాగోలేదు. సైక్లోన్ వచ్చే సూచనలు కన్పిస్తున్నాయ్." ఒణుకుతున్న కంఠంతో అన్నాడు.

త్రుళ్ళి పడ్డాను. కంగారుగా విండో దగ్గరకు పరిగెత్తి ఆకాశంలోకి చూశాను. ఎక్కడా సూర్య కాంతిని కన్పించనివ్వకుండా నల్లటి కారుమేఘాలు కప్పేసి ఉన్నాయ్ ఆకాశాన్ని.

గాలి స్తంభించిపోయింది. భయంకరమైన నిశ్శబ్దం ఆవరించుకొని ఉంది. "మైగాడ్, నువ్వన్నది నిజమే!" అరిచాను. మాట్లాడలేదు ఏజంట్ ఎక్స్-5.

మళ్ళీ నేనే అడిగాను.

"నటూనాకు ఎంత దూరంలో ఉన్నాం?"

మనస్సులోనే లెక్కలు వేసుకొని చెప్పాడు.

"సుమారు అరవై నాట్స్."

"ఐ.సీ." ఆలోచిస్తూ అన్నాను. "అప్పటి వరకూ సైక్లోన్ ఆగదు. సామాన్లు సర్దేయ్. అవసరమైతే బాతిస్కోప్‌లో తప్పించుకొందాం."

"ఓ. కె. బాస్."

ఇంజన్ రూంలోకి వెళ్ళాను. దిక్సూచీలో ముల్లు దక్షిణంగా చూపిస్తోంది. ఇంజన్ ముందు కూర్చొని మాగ్జిమమ్ స్పీడ్‌కు ఫిట్ చేసాను.

అంతకు ముందు స్మాష్ చేసిన వార్ ప్లేన్ గుర్తొచ్చింది. దాన్ని స్మాష్ చేసిన తర్వాత మరికొన్ని మాపై దాడి చెయ్యకపోవటానికి కారణం అర్థమయింది.

సైక్లోన్ నాకు రెండు విధాలుగా ఉపయోగించింది. ముందే రాడార్స్ ద్వారా స్టారమ్‌ను తెలుసుకొన్న చైనీస్ మాపై శాబర్ జెట్‌లను పంపిణీ చెయ్యలేదు. మరొకటి మావద్ద బాతిస్కోప్ వున్న విషయం వాళ్ళకు తెల్సి వుండదు.

తుఫాన్‌లో చస్తామనుకొంటారేగాని బాతిస్కోప్ ద్వారా తప్పించుకొంటామనుకోరు.

ఆలోచిస్తున్నాను. సముద్రంపై గాలి బయలుదేరింది.

పెద్ద పెద్ద అలలు లేస్తోన్నాయ్. రాను రాను గాలి తీవ్రత ఎక్కువైపోతోంది. ఆకాశంలో గాంఢాంధకారం ఏర్పడింది. దాన్ని చీల్చుకొంటూ భయంకరమయిన మెరుపులు.

వంటినిండా చెమటలు పట్టాయి. జీవితంలో మొదటి సారిగా స్టార్మ్‌లో ఇరుక్కోవటం అదే.

గుడ్‌లక్ కెరటాలపై ఎగిరెగిరి పడుతోంది. పరిస్థితి చెయ్యి దాటిపోతోంది.

గబగబా కేబిన్‌లోకి వెళ్ళాను. సామానంతా బాతిస్కోప్‌లోకి సర్దేశాడు కాబోలు మెషిన్‌గన్‌లో అమ్యూనిషన్ నింపుతున్నాడు ఎక్స్-5.

నా చూపులు అప్రయత్నంగా అతని పాదాలవైపు పరిగెత్తాయ్.

అదిరిపడ్డాను.

ఎలా వచ్చిందో, ఎప్పుడొచ్చిందో తెలియదు కాని హెల్ స్నేక్ అతని వెనక్కి వుండి కాటు వెయ్యడానికి సిద్ధంగా వుంది.

మూడడుగుల పొడవు వెదురుగడంతలావు ఉండి శరీర మంతా ఇంద్రధనస్సులా మెరుస్తోంది. శరీరానికి మూడు రెట్లు వుంది తల. చిన్న కళ్ళు, చీపురు పుల్లలాంటి నాలుక కదులుతున్నాయ్.

సముద్రపు పాముల్లో కెలా ప్రమాదకరమైన 'హెల్ స్నేక్' కరిస్తే మనిషి వెంటనే చావడు. ఇరవై నాలుగు గంటలు నరకయాతన అనుభవించి మరీ చస్తాడు.

ప్రతీకణం కరెంట్ షాక్ కొట్టినట్లో లేక కమ్చీలతో మోదినట్లో ఉలికి ఉలికిపడుతూ భరించలేని బాధతో ముడుచుకుపోతాడు.

దాని కాటుకు విరుగుడు ఏ డాక్టరు కనిపెట్టలేక పోయాడు యిప్పటిదాకా.

తక్షణం రివాల్వర్ అందుకొని దాని తలకు గురిపెట్టి కాల్చాను.

కాని ఆలశ్యమైంది.

హెల్ స్నేక్ తల విసురుగా వెళ్ళి ఏజంట్ ఎక్స్-5 కాలుని ముద్దాడింది. ఆ మరుక్షణం బుల్లెట్ దాని తలను బ్రద్దలు చేసింది.

బాధగా అరిచాడు ఏజంట్ ఎక్స్-5. కంగారుగా అతని దగ్గరకు పరిగెత్తాను. కాలు పట్టుకొని ఉండచుట్టుకు పోతున్నాడు.

విషం వేగంగా అతని రక్తంలో కల్సిపోయింది. చావు కళ స్పష్టంగా కన్పిస్తోంది.

"విజయ్...విజయ్..." గొణుగుతున్నాడు. జాలిగా చూసాను.

"విజయ్ ...ప్లీజ్ కిల్ మి" అరిచాడు.

"నో!" దృఢంగా అన్నాను. "సాటి ఏజంట్ను నా చేత్తో చంపలేను."

"షటప్...ఈ బాధ భరించలేను...ప్లీజ్ కిల్ మీ..."

మాట్లాడలేదు నేను. అతని బాధ ఊహించుకోగలను. కాని స్నేహితుడనే మమకారం నన్ను చంపనీయటం లేదు.

"విజయ్..." అతని నోట్లోంచి నురగలొస్తున్నాయ్. తడబడుతున్నాయ్ మాటలు.

"విజయ్...ఎలాగూ కొంచెం సేపటిలో చావాలి నేను. దయచేసి ముందే చంపేసి నన్నీ నరకంనుంచి తప్పించు... ప్లీజ్..." పాములా ముడుచుకు పోతున్నాడు.

బాధగా చూసాను. హెల్ స్నేక్ను కాల్చిన రివాల్వర్తో అతనిని కాల్చటం ఇష్టంలేక షాట్గన్ అందుకొన్నాను.

కళ్ళు మూసుకొని ట్రిగ్గర్ నొక్కాగానే కనురెప్పల చాటునుంచి నీళ్లు రాలాయి అతని మృతశరీరంపై.

షాట్గన్ అతనిపై పడేసి బాతిస్కోప్ తీసుకొని బయటకు దూకాను.

వాతావరణం భీభత్సంగా వుంది. కుంభవృష్టి కురుస్తోంది. కెరటాలతో కల్సి కొట్టుకుపోతోంది గుడ్లక్.

బాతిస్కోప్లో కూర్చుని తలుపేసుకొంటుండగా చూసాను విరుచుకు పడుతున్న కెరటాన్ని. సుమారు నూటేభై అడుగుల ఎత్తుండి ఆకాశాన్ని అంటుతోంది.

మరోక్షణం ఆలస్యమై వుంటే ఏమయ్యేదో తలుచుకో గానే నా గుండె జలదరించింది.

బాతిస్కోప్ నీటి అడుగున దూసుకుపోయింది.

డిక్నాచీ పరికించటంలో మునిగిపోయాను.

ఎక్కడున్నానో తెలీకపోయినా ప్రయాణం మాత్రం నటూనా వైపు సాగుతోందని అర్థమైంది.

6

దాదాపు నటూనా పరిసరాలకు చేరుకొంది బాతిస్కోప్. ఇంకో పదిమైళ్ళుంటుంది నటూనా. ఫ్యూయల్ టాంక్ చూచాను. మరో నాలుగైదు మైళ్ళ కంటే ఎక్కువ రాదు.

ఏం చెయ్యాలో తోచక నిశ్చలంగా రాడార్ స్క్రీన్ పై చూస్తూ నడపసాగాను.

రకరకాల చేపలు అటూ ఇటూ కదులుతూ స్క్రీన్ పై కన్పిస్తున్నాయ్.

మరో వంద అడుగుల దూరం వెళ్ళగానే స్క్రీన్ పై అకస్మాత్తుగా కన్పించిన ఆకారం చూసి ఉలిక్కిపడ్డాను. మరుక్షణం నా ముఖంలో ఆనందం కదులాడింది.

జాగ్రత్తగా చూడసాగాను. అరగంట తర్వాత మళ్ళీ కన్పించిందా సబ్ మెరైన్. పెద్ద సైజు షార్క్ చేపలా వుంది.

ఆపరేషన్ ఐలెండ్ చుట్టూ తిరుగుతూ అరగంట కో సారి కన్పిస్తోంది. దాని వేగం ఎంతలేదన్నా 12 మైళ్ళు తక్కువ ఉండదు.

అంటే గంటకు 12 మైళ్ళ వేగంతో ప్రయాణిస్తోన్న

పడుతోందన్న మాట. దీవి చుట్టుకొలత 6 మైళ్ళని తేలింది.

మీటర్ పై చూసాను జలాంతర్గామికీ బాతిస్కోప్ కు మధ్య దూరం ఎంతో తెల్సుకోడానికి.

రెండు మైళ్ళు. ముందుకు పోనిచ్చాను బాతిస్కోప్.

ఒక మైలు దూరం వెళ్ళాక ఫైరింగ్ సెక్షన్ ఆర్డర్ లోకి తీసుకొచ్చాను. బాతిస్కోప్ చుట్టూ రంధ్రాలున్నాయ్. నిజానికవి రంధ్రాలు కావు. ఎనిమీని ఏటాక్ చేసే ఫైరింగ్ గొట్టాలు.

స్విమ్మింగ్ డ్రెస్ వేసుకొని ఆక్సిజన్ సిలిండర్స్ అమర్చుకొని మెషిన్ గన్, యారో గన్ లను భుజాలకు తగిలించుకొన్నాను. చేతిలో సీ టార్చి ఉంది.

రెండు నిముషాలలో తిరిగి రాడార్ స్క్రీన్ పైకొచ్చింది సబ్ మెరైన్. దగ్గరగా చేరుకొంటోంది బాతిస్కోప్.

దీవికి అటువైపు ప్రయాణిస్తోన్న జలాంతర్గామి చటుక్కున బాతిస్కోప్ వైపు తిరిగింది.

ఫైరింగ్ స్విచ్ నొక్కి ప్రక్కనే ఉన్న సీడోర్ తెర్చుకొని నీటిలోకి జారిపోయాను. గిరగిరా తిరుగుతూ ప్రేలింది బాతిస్కోప్. ఫైరింగ్ గొట్టాల్లోంచి తోసుకెళ్ళి సబ్ మెరైన్ని తాకాయి ఫైర్ బాల్స్.

సీమ టపాకాయలా ప్రేలుతోండగా జలాంతర్గామిలోంచి వెలువడ్డ ఫైరింగ్ కు బాతిస్కోప్ తునాతునకలయింది.

యారోగన్ పొజిషన్ లోకి తెచ్చుకొని టార్చి కాంతిలో ఐలెండ్ వైపు ఈదసాగాను.

అరగంటలో దీవిని సూచిస్తూ పెద్ద పెద్ద రాళ్ళ గుట్టలు ఎదురయ్యాయి. నెమ్మదిగా నీటి ఉపరితలంవైపు వెళ్ళాను.

అరఫర్లాంగ్ దూరంలో కన్పించింది ఐలెండ్. తీరం పొడుగునా పామ్ చెట్లు ఎదిగున్నయ్. వాటివెనక చిన్న సైజు కొండలు.

తృప్తిగా నిట్టూర్చాను ఐలండ్ వెనక్కి చేరినందుకు.

ఒడ్డు చేరుకోగానే స్విమ్మింగ్ డ్రెస్ విప్పి, ఆక్సిజన్ సిలిండర్, యారోగన్‌లతో కలిపి పామ్ చెట్టు మొదట్లో కప్పెట్టి ముందుకు కదిలాను.

సుమారు నాలుగువందల అడుగుల ఎత్తుంది నేనెక్కిన కొండ. గంట పట్టింది పైకి చేరుకోడానికి.

రాయిచాటున కూర్చొని బైనాక్యులర్స్‌తో చూసాను.

సూర్యుడు అస్తమిస్తున్నాడు. మసక కాంతిలో చెట్లక్రిందుగా పెద్ద పెద్ద బిల్డింగ్‌లు కన్పిస్తున్నాయ్. అవతలివైపున కూడా తీరం పొడుగునా ఇలాగే కొండలున్నాయ్.

ఎవరైనా దానిపై అడుగుపెట్టినా పొరపాటున కూడా ఇలా కొండల మధ్య అణ్వాస్త్రాలు తయారు చెయ్యబడుతున్నాయని ఊహించరు.

ఒకచోట వరుసగా చిన్న సైజు రాకెట్స్ మూడు నిలబెట్టబడి ఉన్నాయ్.

అణ్వాస్త్రాలను వాటిలో అమరుస్తున్నారు కాబోలు వాటి చుట్టూ తిరుగుతున్నారు శాస్త్రజ్ఞులు.

ట్రాన్స్‌మీటర్ బైటకు తీసాను. బటన్ నొక్కి "విజయ్ స్పీకింగ్" అన్నాను.

"యస్ రమేష్ మిశ్రా!" అవతలివైపునుంచి బాస్ కంఠం ఆప్యాయంగా పలికింది.

"బాస్... నేను ఆటమిక్ ఐలెండ్ కనుకొన్నాను..." చిన్నగా అరిచాను.

"వెల్ మై బాయ్...ప్రొసీడ్..." ఆతృతగా అంటున్నారు బాస్.

ఎక్కడుందో చెప్పాను.

మరో రెండు నిముషాలు ఆయనతో మాట్లాడి ముందుకి కదలబోయాను.

మెడపై చల్లగా గన్ బారల్ తగిలింది. కొయ్యబారి పోయాను.

7

"హూ ఆర్ యూ?" కర్కశంగా విన్పించింది.

"టూరిస్ట్!" అన్నాను పెదాలతో నాలిక తడుపు కొంటూ.

"ఎలా వచ్చావిక్కడికి?"

"తుఫాన్లో తప్పించుకొని కొట్టుకొచ్చాను." అన్నాను. కాని వాడు ట్రాన్స్మిటర్ చూసాడేమో నని భయంగా ఉంది.

ఊహించనంత వేగంతో నా భుజం పట్టుకొని వెనక్కి త్రిప్పి ఈడ్చి దవడపై కొట్టాడు. కళ్ళు బైర్లు కమ్మాయి.

తేరుకొని అతనివైపు పరీక్షగా చూసాను. ఆఫీసర్ డ్రెస్లో ఉన్నాడు.

సాధారణంగా చైనీస్ పొడుగుండరు. కాని వీడు మాత్రం చాలా పొడుగ్గా దాదాపు నా ఎత్తులో ఉన్నాడు.

"ఇడియట్ నువ్వు ట్రాన్స్‌మీటర్‌లో మాట్లాడటం నేను చూడలేదనుకొన్నావా? నువ్ స్పైవి! అవునా?" అరిచాడు.

మౌనంగా ఉండిపోయాను. తిరిగి వాడే అన్నాడు.

"నువ్వు ఎవరివైనా నీకు చావు తప్పదు. ఈ ఐలెండ్‌లోనికి అనుమతి లేకుండా ఎవరు ప్రవేశించినా కాల్చేయమని మాకు ఆర్డర్స్ ఉన్నాయ్."

మిషిన్ గన్ విలాసంగా ఊపుతున్నాడు. ఏ మాత్రం తొందరపడినా ఒళ్ళంతా తూట్లు చేస్తాడు.

క్రిందకి చూసాను. సరిగా నా కాలు ప్రక్కనే చిన్న రాయి ఉంది. తప్పించుకోడానికి కా అవకాశం చాలు.

గన్ ఊపడం ఆపేశాడు. దాని చుట్టూ ఊపిరి బిగబెట్టి కాలు ముందుకి జరిపాను.

"యూ డర్టీ స్పై, మా ఆపరేషన్‌ను స్మాష్ చెయ్యడానికి వచ్చినందుకు ప్రతిఫలం అనుభవించు." అరుస్తూ ఫైర్ చేసాడు. రాతిని కాలితో తన్నేస్తూ ప్రక్కకి పల్టీ కొట్టాను.

బులెట్స్ రాళ్ళను తొల్చేశాయ్. రాయి కాలికి బలంగా తగలటంతో 'కీర్'మంటూ కూలబడ్డాడు చైనీస్ ఆఫీసర్.

వాడిపైకి దూకి ముఖంపై గుద్దాను. ఆర్తనాదం చేసాడు.

విజృంభించాను. అర నిముషంలో స్పృహ తప్పించి బట్టలు మార్చుకొన్నాను. నావి వాడికి తొడిగాను.

హాట్‌ని ముందుకు లాక్కొని మిషిన్ గన్ భుజానికి తగిలించుకొని క్రిందకి దిగసాగాను.

దిగే కొద్దీ స్పష్టంగా కన్పిస్తోన్నాయ్ బిల్డింగ్స్. వాటి మధ్యనున్న ఎత్తైన బిల్డింగ్ నన్నాకర్షించింది. 'ఆపరేషన్ నటూనా' అక్షరాలు దాని గోడపై అందంగా పేర్చబడ్డాయి.

బాగా చీకటి పడింది. బిల్డింగ్స్‌లో లైట్లు వెలిగాయ్. అండర్‌గ్రౌండ్‌లో మిషన్స్ చేస్తున్న ధ్వనికి కాబోలు భూమి అదురుతోంది.

సోల్జర్స్ చెట్ల క్రింద తిరుగుతున్నారు. హాట్‌ను పూర్తిగా ముఖంపై లాక్కొన్నాను. మెడచుట్టూ ఉన్న మఫ్లర్ గడ్డాన్నికూడా కప్పుతోంది.

“ఆగు! కదలకు” అరిచారు ఇద్దరు సైనికులు టార్చి వేస్తూ. ముఖానికి అడ్డుగా చెయ్యిపెట్టి, “స్టుపిడ్స్! టార్చి ఆర్పెయ్యండి” అరిచాను కోపంగా చైనా భాషలో.

టార్చి వేసిన సైనికుడు ఆర్పేశాడు. రెండోవాడు తుపాకీ దింపేశాడు.

“తెలియదు సార్! చూడలేదు, క్షమించండి!” అన్నాడు వణుకుతూ. నేను వేసుకొన్న యూనిఫారం చూసి తమ ఆఫీసర్ అనుకొన్నారు వాళ్ళు.

“ఈసారి ఇటువంటి పొరపాటు చెయ్యకండి. తోలు ఊడదీస్తాను” అరిచాను. ఆ సైనికులు ప్రక్కకు తొలిగారు.

దర్జాగా, ఠీవిగా ముందుకు నడిచాను. చుట్టూ జీపులు ట్రక్కులూ కన్పిస్తున్నాయ్. బిల్డింగ్స్‌కి దూరంగా రాకెట్స్ నిలబడి వుండి తెల్లవారగానే మూడు దేశాలను నాశనం చెయ్యడానికి ఎదురు చూస్తున్నాయ్.

కసిగా పళ్ళుకొరుక్కున్నాను. దేవుడు దయతలిస్తే ఏ వక్కడినీ ఈ దీవినుంచి బైటకు పోనివ్వకుండా చంపా లనుకొన్నాను నేను చచ్చినా సరే.

ఎవరో హడావిడిగా వస్తున్న అలికిడి అయింది. ఆగి పోయాను. అటు వస్తున్న సెంట్రీ నన్ను చూడగానే ఆగి సెల్యూట్ చేసాడు.

"ఏమిటి?" అడిగాను.

"కమాండర్ మిమ్మల్ని పిలుస్తున్నారు."

"దేనికి?"

"నాకు తెలియదు. వెంటనే రమ్మంటున్నారు."

"ఎక్కడున్నారు?" అడిగాను మామూలుగా. కొంచెం అనుమానంగా చూసాడు.

"ఇడియట్ త్వరగా చెప్పి చావు!" అరిచాను చైనీస్ ఆఫీసర్ లా.

"సైంటిస్ట్ గారి బిల్డింగ్ లో సార్" అన్నాడు.

"సరే నువ్వెళ్ళు, వస్తాను" అన్నాను.

నా మనస్సు ఆనందంతో ఉరకలేసింది.

'మంచి అవకాశం. సైంటిస్ట్ కమాండర్ వకేచోట వున్నారు. వీలైతే ఆపరేషన్ స్మాష్ చెయ్యడంతోపాటు వాళ్ళిద్దరినీ కూడా చంపేసి ఈ దీవినుంచి వెళ్ళిపోవాలి' అనుకొన్నాను కొండపైనుంచి చూస్తూండగా ఆపరేషన్ నటూనా బిల్డింగ్ పై కనిపించిన హెలికాప్టర్ గుర్తొచ్చి.

బయలుదేరాను కమాండర్ దగ్గరకు. సెంట్రీబూట్స్ టకటకా చప్పుడుచేసి సెల్యూట్ పెట్టాడు.

ఆపరేషన్ నటూనా చేరుకొన్నాను. నన్ను అనుస రించి వస్తున్న సెంట్రీ నా వెనకనే నిలబడి వున్నాడు. క్రూరంగా చూసాను.

మొహం ప్రక్కకి తిప్పుకొన్నాడు. ఒళ్ళు మండి పోయింది. కాని చేసేదేమీ లేక ఊరుకొన్నాను.

బిల్డింగ్ గేటుదగ్గర నిలబడ్డ సెక్యూరిటీ గార్డ్స్ చేతులు చాపారు ఐడెంటిఫికేషన్ కార్డుకోసం. వాళ్ళ చేతుల్లో గన్స్ ఆకలిగా చూస్తున్నాయ్. జేబులో చెయ్యిపెట్టితీసి ఇచ్చాను. వాళ్ళ ముఖంలో తృప్తి కదులాడింది.

తిరిగి ఇస్తూ సెల్యూట్ చేసారు. గమనించనట్టుగా ముందుకు నడిచాను. సెంట్రీ నన్ను అనుసరిస్తున్నాడు. గేటు దాటగానే అయోమయంలో పడి ఆగిపోయాను. చాలా దారులు కన్పిస్తున్నాయ్.

మంచి ఐడియా తట్టింది.

సెంట్రీవైపు తిరిగి కొరకొరా చూసాను. "ఇడియట్ నిన్ను పొమ్మన్నా ఎందుకనుసరిస్తున్నావ్?" అరిచాను. నిర్లక్ష్యంగా చూసాను.

"రాస్కెల్ కమాండర్ దగ్గర కెళ్ళాక నీ పొగరు అణుస్తాను పద!" చాచి దవడమీద కొట్టాను.

వాడిచెయ్యి గన్ పై బిగుసుకొంది. అదోలా చూసి ముందుకు కదిలాడు.

వాడి ప్రవర్తన నాలో అనుమానం రేపుతోంది. కాని ఈ పద్మవ్యూహంలో ప్రవేశించాక చేసేదేమీ లేక మౌనంగా వాడిని అనుసరించాను.

లిఫ్ట్ ఎక్కి థర్డ్ ఫ్లోర్ లోకి చేరుకొన్నాము. వక గది ముందాగాడు సెంట్రీ. గుమ్మానికి అటూ ఇటూ నిలబడ్డ సైనికులు సెల్యూట్ కొట్టారు.

గుండె వేగంగా కొట్టుకొంటోంటే ఠీవిగా వెళ్ళి డోర్ పై శబ్దం చేసాను.

"కమాన్ కర్నల్" లోపలినుంచి గంభీరంగా విన్పించింది. లోపలికెళ్ళిన నా వెనుకే తలుపులు మూసుకొన్నాయ్.

"వెల్ కమ్ మై డియర్ ఇండియన్ స్పై" చేతిలోని పాట్ గన్ విలాసంగా ఊపుతూ పరిహాసంగా అన్నాడు కమాండర్. అతని ప్రక్కనే వున్న వృద్ధుడైన సైంటిస్ట్ వికృతంగా నవ్వుతోన్నాడు.

నా వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చింది.

8

'నా చరిత్ర పూర్తయింది!' అనుకొన్నాను గుటకలు వేస్తూ.

"ఎలా వుంది మిస్టర్ మా అతిథి సత్కారం" అడిగాడు కమాండర్ వెకిలిగా నవ్వుతూ.

"ఫైన్।" అన్నాను. "కాని చిన్న డౌట్!"

"ఏమిటది?"

"ఏమీ లేదు. ఈ ఆఫీసర్ వేషంలో వున్న నన్ను ఎలా తెలుసుకొన్నారు?" అడిగాను.

"నేను చెప్పాను" లేచాడు సైంటిస్ట్.

"నీ పేరు?"

"షాంగ్ చీ!" నవ్వాడు.

"మిస్టర్, నువ్వు మా గురించి మా ఆపరేషన్ గురించి చాలా తక్కువ అంచనా వేసుకొన్నావని నా కిప్పుడు అర్ధమౌతోంది.

నువ్వు సింగపూర్ నుంచి బైలుదేరి హాంకాంగ్ చేరుకొన్నప్పుడే నీ సంగతి మాకు తెల్సిపోయింది. కాని మేము చేసిన పొరపాటు ఏమిటంటే అప్పుడే మిమ్మల్ని చంపక

'మీరు సాగించిన వెతుకులాటలో ఏ సముద్రజంతువు పాలబడో చస్తారులే' అనే అశ్రద్ధతో మీ గురించి జాగ్రత్త పడలేదు.

కాని అన్ని అడ్డంకులూ ఎదుర్కోనక తప్పలేదు. ఫలితం లేకపోగా మేము ఒక 'వార్ ప్లేన్' ఒక 'గన్ బోట్' నష్టపోయాము. తిరిగి మరికొన్ని వార్ ప్లేన్స్ పంపుదామంటే నీ అదృష్టంకొద్దీ సైక్లోన్ అడ్డొచ్చింది.

అంత సైక్లోన్‌లోంచి కూడా బాతిస్కోప్‌లో తప్పించుకొని ఐలెండ్‌లో అడుగుపెట్టావ్.

ఎన్నో ప్రమాదాలు సమయస్ఫూర్తితో తప్పించుకొన్న నువ్వు, ఈ ఐలెండ్‌లో కొండల మధ్య అణ్వాస్త్రాలు తయారుచేస్తున్న మేము చుట్టూ సముద్ర తీరాలలో ఏ రక్షణా లేకుండా అంత నిర్లక్ష్యంగా వదిలేస్తామని ఎలా అనుకొన్నావ్?"

నా పొరపాటు అర్థమైంది.

"ఐ. సీ. పామ్‌చెట్ల మధ్య టెలివిజన్ కెమెరాలు అమర్చారన్నమాట?" అన్నాను.

"బాగా తెల్సుకొన్నావ్. పామ్‌చెట్ల మధ్యే కాదు కొండరాళ్ళ మధ్యకూడా పవర్‌ఫుల్ ట్రాన్స్‌మీటర్స్ అమర్చాము. సరిగ్గా నువ్వు నక్కిన కొండరాయిక్రిందే ట్రాన్స్‌మీటర్ ఉంది" కమాండర్ అన్నాడు.

సెంట్రీ ప్రవర్తనకు కారణం తెలిసింది.

"ఐలెండ్ కనుక్కోవటంలో నువ్వు చాలా లేట్ చేసావు మిస్టర్. ఆఖరు క్షణాలలో నీ కర్తవ్యాన్ని జయప్రదంగా నిర్వహించి ఫలితాన్ని నీ బాస్‌కు తెల్పావు.

కాని అతను కూడా చేసేదేమీ లేదు.

తెల్లవారితే మీ ఇండియాలో మిగిలేది మనుషులు కాదు మట్టి. వరల్డ్ మాప్‌లో ఆ స్థలం ఏమవుతుందో తెల్సా? నీలిరంగు ఆక్రమించుకొంటుంది!" పిశాచంలా నవ్వాడు షాంగ్ చీ.

అసహ్యంగా చూసాను. "మీరు మనుష్యులు కాదు ...రాక్షసులు... డెవిల్స్!" అరిచాను.

పిడికిలి బిగించి దవడపై గుద్దాడు. పెదవి చిట్లి రక్తం బయటకు వచ్చింది.

కోడి తలకాయలా ఉన్నవాడి తలను పరిచేయాలన్పించిన బలమైన కోర్కెను అణుచుకొన్నాను.

రక్తం నోట్లోకి వెళ్ళి ఉప్పగా తగిలింది.

"పొరపడుతున్నావ్. ఇంకా తెల్లవారటానికి పది గంటలుంది. ఆ సమయం చాలు ఇండియన్ 'నాట్' విమానాలు ఇక్కడికి చేరుకోడానికి," నాలుకతో పెదవులపై గాయాన్ని రుద్దుకొంటూ అన్నాను.

"లాభంలేదు మిస్టర్. ఆ ఆశలేం పెట్టుకోకు. ఈ పాటికి నటూనాలో ప్రతీ దీవిలో ఉన్న మా ఆర్మీ వార్‌కు సిద్ధంగా ఉంటుంది.

సింగపూర్ దాటిన ఏ వార్ ప్లేన్ అయినా యాంటీ ఎయిర్ క్రాఫ్ట్ గన్స్ దెబ్బతిని దక్షిణ చైనా సముద్రంలో కూలవలసినదే. మరో విషయం ఇక్కడికి ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న 'క్వీనా' ద్వీపం సింగపూర్‌నుంచి 'ఆపరేషన్ నటూనా' చేరేవారికి ముందుగా ఎదురవుతుంది.

ఆ దీవికి మైలు దూరంలో లంగరు వేయపడిన మా నావల్ వార్ షిప్‌పై పదంగుళాల ఆర్మీ గన్స్ నాలుగు ఆకాశంలోకి చూస్తుంటాయ్. ఒకోదానికి అమర్చబడిన

టెలిస్కోప్ పొడవెంతో తెల్సా? 15 అంగుళాలు. ఏ క్షణాన అవసరమైతే ఆ క్షణాన అది ఇక్కడకు చేరు తుంది.

"పోతే ఇక్కడున్న ఎక్విప్‌మెంట్స్ గురించి నీకు చెప్పనక్కరలేదనుకొంటాను." ఆర్మీ కమాండర్ అన్నాడు.

వింటోంటే మతి పోతోంది.

"డోన్ట్ బీ ఎఫ్రైడ్ మిస్టర్. నిన్నిప్పుడే చంపదల్చు కోలేదు. ఈ రాత్రంతా సుఖంగా నిద్రపో. తెల్లవార గానే ఇక్కడినుంచి బైలుదేరిన రాకెట్స్ ఇండియా రహస్యాలను ఎలా రూపుమాపుతాయో టెలివిజన్‌లో చూసి మరి చద్దువు గాని." నా ముఖంలోకి చూస్తున్న సైంటిస్ట్ పరిహాసంగా అన్నాడు.

"థాంక్స్!" అన్నాను. "సిగరెట్ కాల్చుకో వచ్చా?"

"నీదగ్గరున్న ఆయుధాలిచ్చేస్తే అభ్యంతరమే లేదు" అన్నాడు కుర్చీలోంచి లేవకుండా కమాండర్.

మెషిన్ గన్ రివాల్వర్ డాగర్‌లాంటి వెపన్స్ అన్నీ నేలపై పడేశాను.

"వెల్, ఇక కాల్చుకో!" అంటూ టేబిల్‌పై వున్న సిగరెట్ పాకెట్ లైటర్ నా వైపు విసిరాడు. అందు కొని సిగరెట్ నోట్లో పెట్టుకొంటూ కమాండర్ వైపు కోరగా చూసాను.

తలవంచుకొని సిగరెట్ కాల్చుకోబోతుండటం వలన నా చూపును అతను గమనించే అవకాశం లేదు.

గన్‌ను దృఢంగా పట్టుకొన్నాడు. చెయ్యేమాత్రం షేక్ ఇవ్వటంలేదు.

లైటర్ వెలిగించి సిగరెట్ దగ్గరగా చేర్చాను. చటుక్కున తలెత్తి గట్టిగా ఊదాను.

అంచు అంటుకున్న సిగరెట్ విసురుగా వెళ్ళి కమాండర్ ఒళ్ళో పడింది.

"ఓ మైగాడ్!" త్రుళ్ళిపడుతూ కంగారుగా లేచి నిలబడ్డాడు కమాండర్. వేగంగా వాడివైపు దూకాను.

కాని ఆలశ్యమైంది. వెనకనుంచి తలపై బలంగా మోదారెవరో. కళ్ళముందు అణ్వాస్త్రాలు కన్పించాయి.

స్పృహ తప్పి నేలకూలుతుండగా అస్పష్టంగా కన్పించింది, నా వెనకనున్న సెంట్రీ అటెన్షన్‌లో నిలబడి కమాండర్‌కు సెల్యూట్ కొట్టే దృశ్యం.

9

తలంతా భారంగా ఉంది.

కళ్ళు తెరిస్తే సూదులతో పొడుస్తున్నట్లు ఉంది. అప్రయత్నంగా తల తడుముకొన్నాను. గడ్డకట్టిన రక్తం చేతికి పెళుసులా తగిలింది. తిరిగి కళ్ళు మూసుకొన్నాను.

సమయం గడిచింది.

బాధకొద్దిగా ఉపశమించింది. కళ్ళు బాగా తెరిచి గదంతా చూసాను. పోలీస్ స్టేషన్‌లో సెల్స్‌కు దీనికి తేడా ఏమీ కన్పించలేదు. కాంక్రీట్ చెయ్యబడిన గది కప్పుమధ్యనుంచి వ్రేల్లాడుతోన్న ఎలక్ట్రిక్ లాంప్ కాంతి వెదజల్లుతోంది.

ఎందుకో ఫిషర్, ఏజంట్ X-5 గుర్తుకొచ్చారు. తల విదిల్చి లేచి కూర్చొన్నాను. గోడకు వ్రేల్లాడుతోన్న వాటర్ బాగ్ ఆకర్షించింది. దానిలోని చల్లని నీళ్ళతో మొహం కడుక్కొని, మిగిలినవి త్రాగాను.

ప్రాణం లేచొచ్చినట్లయింది. షర్ట్ బటన్స్ తడుము కొన్నాను. వాటిరూపంలో ఉన్న మినీ బాంబ్స్ చేతికి గట్టిగా తగిలి ధైర్యాన్నిచ్చాయ్.

టైం చూసుకొన్నాను. ఐదుగంటలైంది. మరో గం టలో జరగబోయేదాన్ని గూర్చి ఊహించటానికి ధైర్యం చాలలేదు.

ఏదేమైనా ప్రపంచం భవిష్యత్ ముఖ్యంగా ఇండియా రష్యాల భవిష్యత్ ప్రస్తుతం నా చేతిపై ఆధారపడి ఉంది. మరో గంటలో అదికూడా తేలిపోతుంది.

ఆలోచిస్తూ కూర్చున్నాను. గంట గడిచింది. ఎవరో వస్తున్న బూట్ల శబ్దం విన్పిస్తోంది. తలుపులవైపు చూస్తూ నిలబడ్డాను.

చటుక్కున తలుపులు తెరుచుకొన్నాయ్. సైంటిస్ట్ షాంగ్ చీ, కమాండర్, నేను దెబ్బతీసిన కర్నల్, మరో నలుగురు సోల్జర్స్ గన్స్‌తో లోనికొచ్చారు.

"హలో గుడ్ మార్నింగ్!" ముందుగా పలకరించాడు షాంగ్ చీ నవ్వుతూ.

"నో... బాడ్ మార్నింగ్" అన్నాను గంభీరంగా.

"ఎవరికి? నీకా?" వెటకారంగా అడిగాడు.

"అవకాశం దొరికితే నీకూనూ" అంటూ కర్నల్ వైపు చూసాను. క్రోధంగా మింగేసేవాడిలా నా వైపు చూస్తు న్నాడు.

"కమాన్ మిస్టర్... మా ఆటమిక్ రాకెట్స్ ఎలా మీ దేశాన్ని నాశనం చేస్తాయో చూసి తరిద్దువుగాని" అంటూ బైటకు నడిచాడు కమాండర్.

ఇద్దరు సోల్జర్స్ నా వెనక్కివచ్చి మెషిన్ గన్స్ వీపుకు నొక్కిపెట్టి ముందుకు నెట్టారు. గదినుంచి బైటకొచ్చాము.

పొడుగాటి నడవాదాటగానే విశాలమైన హాలు ఎదురయింది. అక్కడినుంచి అన్నివైపులకూ మెట్లున్నాయ్.

క్రిందకి వెళుతోంది సైంటిస్ట్ బృందం. ఎక్కడికి వెళుతున్నామో తెలియకపోయినా ఆదారి మాత్రం అండర్ గ్రౌండ్ లోకి వెళ్తోందని గ్రహించగలిగాను.

మెట్లు అంతమయ్యాయి. దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లలో ఎటుచూసినా రకరకాల మెషిన్స్ ముందు శాస్త్రజ్ఞులు కన్పిస్తున్నారు. వాటిని దాటుకొంటూ వెళ్ళి ఒక ద్వారం ముందు ఆగాము.

స్వింగ్ డోర్ నెట్టుకొని లోనికి ప్రవేశించగానే ఆశ్చర్యంతో నివ్వెరపోయాను. గదిలో ఎక్కడచూసినా అణ్వస్త్రభాగాలు కన్పిస్తున్నాయ్. అరడజనుమంది సైంటిస్ట్స్ వాటిని జాగ్రత్తగా కలుపుతూకూర్చున్నారు.

అక్కడున్న అణ్వస్త్రాలతో అరగంటలో సగం ప్రపంచాన్ని నాశనం చేసెయ్యొచ్చు అన్పించింది నా కాక్షణంలో.

తన గదిముందు ఆగి లోనికి నడిచాడు సైంటిస్టు. గన్ బారెల్స్ తో ముందుకి నెట్టారు నన్ను. తలుపులు మూసుకుపోయాయ్. బైటుండిపోయారు సోల్జర్స్.

కమాండర్ సైంటిస్ట్ షాంగ్ చి చెరో కుర్చీలో కూర్చున్నారు. గన్ పట్టుకొని నా వైపు తీక్షణంగా చూస్తున్నాడు కర్నల్. షాంగ్ చీ కుర్చీకెదురుగా టేబిల్ పై టెలివిజన్స్ అమర్చబడి ఉన్నాయ్. రకరకాల మెషిన్స్, వాటి రంగురంగుల బటన్స్ తో మెరుస్తూ టెలివిజన్స్ ముందు అమర్చబడి ఉన్నాయ్.

రిసీవర్ తలకు తగిలించుకొని రాకెట్స్ దగ్గరున్న శాస్త్రజ్ఞుల బృందంతో కిచకిచా మాట్లాడుతున్నాడు

షాంగ్ చీ. కమాండర్ మాత్రం నిర్వికారంగా సైంటిస్ట్ వైపు చూస్తున్నాడు. అతని కళ్లు అవ్యక్తమైన ఆనందంతో మెరుస్తున్నాయ్.

గదంతా కలయచూసాను. ఎటుచూసినా సైన్సు పరికరాలే కన్పిస్తున్నాయ్. అర్థంకాని మిషన్స్ అల్లిబిల్లిగా అల్లుకుపోయి ఉన్న వైర్లు, యాసిడ్సు, ధాతువులు, చూస్తుంటే తల తిరుగుతోంది. అకస్మాత్తుగా ఒకచోట ఆగిపోయాను. ఒళ్ళు జల్లుమంది.

సైంటిస్ట్ షాంగ్ చీ ఎదురుగా ఉన్న మిషన్ కు కొంచెం ప్రక్కగా గోడవారనే స్టాండుపై నిలబెట్టబడివున్న గాజుపెట్టెలలో చుట్టలుచుట్టుకొని బుసలు కొడుతున్నాయ్ స్నేక్స్, ప్రపంచంలోకెల్లా భయంకరమైన పాయిజన్ స్నేక్స్.

సంభాషణ ఆపాడు షాంగ్ చీ. అతని వ్రేళ్లు మిషన్ బటన్సుపై కదిలాయ్. టెలివిజన్సులో మూడు రాకెట్సు కన్పించటం ప్రారంభించాయ్. వాటి పరిసరాలలో ఉన్న వారంతా ట్రక్కులలో దూరంగా తరలిపోతున్నారు.

ట్రాన్స్మిటర్ వేసి ప్రెసిడెంట్ తో రెండు నిముషాలు మాట్లాడాడు. షాంగ్ చీ ముఖం వెలిగింది. నావైపుచూసి విషపు నవ్వొకటి నవ్వాడు.

ఐలెండ్ లో ఉన్న వార్నింగ్ సైరన్సు మ్రోగనారంభించాయ్. దీవిలోని సెక్యూరిటీ అంతా బిల్డింగ్స్ లోకి చేరుకొంటోంది.

నా గుండెలు దడదడ లాడుతున్నాయ్. నానుదుటిపై నుంచి చెమట ధారగా ప్రవహిస్తూంది. అరనిముషం గడిచింది.

మైక్‌లో కౌంటింగ్ ప్రారంభమైంది. ఆ ముగ్గురిలో ఒకరకమైన టెన్షన్ కన్పిస్తోంది. పాంగ్ చీ వ్రేళ్ళు మిషన్ బటన్స్‌పై బడ్డాయి.

"నైన్... ఎయిట్... సెవన్..." స్పీకర్‌లోంచి కౌంటింగ్ విన్పిస్తోంది.

ఆకుపచ్చనిరంగు బటనుపై వ్రేలుంచాడు పాంగ్ చీ.

అకస్మాత్తుగా నా దృష్టి ప్రక్కనున్న ఎరుపు రంగు బటన్‌పై నిల్చింది.

బటన్‌పై 'S' అన్న అక్షరం మెరుస్తోంది.

"S అంటే?"...

'స్మాష్...స్మాష్...' పిచ్చిగా అనుకొన్నాను.

'ఎలాగయినా దానిని ప్రెస్ చెయ్యగలిగితే చాలు. నా ప్రాణాలు పోయినా ఆ రాకెట్స్ స్మాష్ చెయ్యాలి. కాని ఎలా?' విపరీతంగా ఆలోచిస్తున్నాను.

"ఫైవ్...ఫోర్...త్రీ..." అరుస్తోంది మైక్ రాక్షసిలా.

ఊపిరి బిగబెట్టి చూస్తున్నాను. పాంగ్ చీ ముఖం బిగుసుకొంది. వృద్ధ పిశాచంలా ఉన్నాడు.

"టూ...వన్...జీరో..."

అంతే, బటన్ నొక్కేశాడు.

చెవులు చిల్లులు పడేంత శబ్దం అయింది. దీవి గట్టిగా కంపించింది.

10

రాకెట్స్ ఇంజన్ ప్రేలి ఇంధనం అంటుకొని విపరీతమైన వేగంతో మంటలను క్రిందకు విరజిమ్ముతూ పైకి లేచాయ్.

వికటాట్టహాసం చేసాడు పాంగ్ చీ. టెలివిజన్ స్క్రీన్ పై కదులుతున్నాయ్ రాకెట్స్. మాటి మాటికీ

తన వాచీ, టెలివిజన్‌ను పరిశీలించడంలో మునిగిపోయాడు సైంటిస్టు.

మొదటి రెండూ ఇండియా రష్యాల పైకని తెలుసు. కాని మూడో రాకెట్ దేనిపైకో అర్థం కాలేదు.

నిముషం గడిచింది. స్క్రీన్‌పై రాకెట్స్ క్రింద కని పిస్తున్న నీలి సముద్రం అదృశ్యమైంది. భూప్రదేశం కన్పి స్తోంది అంతా.

ఇండియా చేరుతోంది మొదటి రాకెట్. పావు గంటలో జరగబోయే విధ్వంస కాండ కళ్ళ ముందు కన్పిస్తోంది.

ప్రతీ అవయవాన్ని అదుపులోకి తెచ్చుకొన్నాను. ఎక్కడలేని తెగింపు వచ్చేసింది. మూర్ఖంగా వక్క ఉరుకు ఉరికి షాంగ్‌చీ దగ్గరకు చేరుకొన్నాను.

అప్రమత్తంగా ఉన్న కల్నల్ ఫైర్ చేసాడు. రెండు గుళ్ళు కుడి భుజంలోనూ మరో రెండు ప్రక్కటెముకల లోనూ దిగబడ్డాయ్.

బాధగా కేక వేసాను. కాలు జరిగింది. విసురుగా వెళ్ళి మెషిన్‌పై పడ్డాను. షాంగ్‌చీ గన్ అందుకొ న్నాడు. కమాండర్ అరుస్తున్నాడు.

అందే దూరంలో ఉంది రెడ్ బటన్. ఊపిరి బిగబెట్టి మెరుపులా చేయిచాచి బటన్‌పై గుద్దేశాను.

నా ప్రయత్నాన్ని ముందే గమనించాడు షాంగ్‌చీ. 'నో' అంటూ గది దద్దరిల్లేలా పిచ్చి కేక పెట్టాడు. కాని ఆలస్యమై పోయింది.

టెలివిజన్ స్క్రీన్‌పై వాయువేగంతో కదులుతున్న ఆటమిక్ రాకెట్స్ భయంకరమైన విస్ఫోటంతో ఆకాశం లోనే ప్రేలిపోయాయి.

అంతా రెప్పపాటు కాలంలో జరిగిపోయింది. ట్రిగర్ నొక్కాడు మళ్ళీ కర్నల్. గమనించి ప్రక్కకు జరిగాను షాంగ్ చీ కాళ్ళు అడ్డు పడటంతో విసురుగా వెళ్ళి ఒక గాజు పెట్టెపై పడ్డాను.

భళ్ళున బ్రద్దలైంది. ఆలోగా కర్నల్ కాల్చినబులెట్స్ని దూసుకెళ్ళి అడ్డొచ్చిన కమాండర్ తల బ్రద్దలు చేసాయ్.

'బుస్' మంది ప్రక్కనే. అదిరిపడి చూసాను. గోధుమ రంగు త్రాచు పడగపై లేచి బుస కొడుతోంది.

చటుక్కున దాని మెడ పట్టుకొని నా వైపు తిరుగుతున్న కర్నల్ ముఖంపై విసిరాను. ఊహించని ఆ పరిణామానికి కెవ్వుమన్నాడు వాడు. రెచ్చిపోయిన త్రాచు వాడి ముఖంపై నాలుగైదు కాట్లేసింది.

మైక్ లో అరుపులు వినిపిస్తున్నాయ్. గది బయట తలుపులు బాదుతున్నారు. నివ్వెరపోయి చూస్తున్నాడు షాంగ్ చీ. ఎంతో శ్రమపడి తయారు చేసిన ఆటమిక్ రాకెట్స్ ఊహించని పరిణామానికి గురై నాశనం కావటం అతన్ని నిశ్చేష్టుడిని చేసింది.

ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాను. ఒక్కంగలో నేలపై కొట్టుకొంటోన్న కర్నల్ను చేరుకొని అతని చేతిలోని గన్ లాక్కున్నాను.

గోధుమ త్రాచు కర్నల్ మెడ చుట్టూ మెలికలు తిరుగుతోంది.

తేరుకొంటున్న షాంగ్ చీ వైపు గురిపెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చేశాను. కుడి భుజంలో దిగిన బుల్లెట్స్ విపరీతంగా సలుపుతున్నాయ్. రక్తం బాగా స్రవించటంతో కళ్ళు తిరుగుతున్నాయ్.

షాంగ్ చీ టేబిల్ పై ఉన్న రెండు బాంబులు జేబులో వేసుకొని తలుపు వైపు పరిగెత్తాను.

డోర్ తియ్యగానే లోనికి జొరబడుతున్న సోల్జర్స్‌ను కాల్చేసి బైటకు చేరుకొన్నాను.

ఈ డెవిల్స్ బ్రిగేడ్ బిల్డింగ్‌లోకి జొరబడక ముందే ఇక్కడి నుంచి పారిపోవాలని నా ఉద్దేశం.

అణ్వాస్త్ర భాగాలు విడి విడిగా కన్పిస్తున్న గది దాటాను. అంత క్రితం రకరకాల మెషిన్స్ ముందు కన్పించిన శాస్త్రజ్ఞులు అయోమయంగా అరుచుకొంటున్నారు. నన్ను చూడగానే అందరి నోళ్ళూ మూతలు పడ్డాయ్. చేతులు జేబుల్లో దూరాయ్. షర్ట్ బటన్స్ రూపంలో ఉన్న మినీబాంబ్స్ వారిపై విసిరాను. ప్రేలుళ్ళతో పాటు వాళ్ళ శరీరాలు తునాతునకలయ్యాయ్.

పరిగెత్తుకొంటూ వెళ్ళి మెట్లు చేరుకొని అండర్ గ్రౌండ్ లోంచి పైకి వెళ్ళేసరికి సోల్జర్స్ బిల్డింగ్‌లోకి చొచ్చుకొస్తున్నారు. చక చకా బిల్డింగ్ పైకి పరిగెత్తాను అడ్డు వస్తున్న వాళ్ళను కాలుస్తూ.

టెర్రస్ పైకి చేరుకొంటుండగా కొండల వెనకనుంచి సూర్యుడు పైకి లేస్తున్నాడు. మరో రెండు బుల్లెట్స్ నా తొడల్లో దూరాయ్. నాలుగు బటన్ బాంబ్స్ అందుకొని మెట్లపైగా పైకి వస్తున్న సోల్జర్స్ పైకి విసిరి హెలికాప్టర్ దగ్గరకు పరుగెత్తాను.

కాలూ, చెయ్యి పూర్తిగా అధీనం తప్పాయ్. ఇంజన్ స్టార్ట్ చేసి పైకి లేపాను. బ్లేడ్స్ గిర్రున తిరుగుతూ ఆకాశం లోకి లేచింది హెలికాప్టర్.

ఇన్‌స్ట్రుమెంట్ పానల్ వైపు చూస్తూ జేబులోంచి బాంబులు తీసాను.

క్రింద నుంచి సోల్జర్స్ మెషిన్ గన్స్ కాలుస్తున్నారు. 'యాంటీ ఎయిర్ క్రాఫ్ట్ గన్'ను రంగంలోకి తెచ్చారు కాబోలు 'ఢాం... ఢాం...' అంటూ కొండలను అదర గొడుతోంది.

రెండు వేపులా కొండలౌటంవలన నేరుగా ముందు కెళ్ళడానికి వీలులేక చుట్టూ చుట్టలు తిరుగుతూ పైకి లేపవలసి వస్తోంది హెలికాప్టర్‌ను.

విఫలయత్నం చేస్తున్నాను ఎయిర్ క్రాఫ్ట్ గన్ బారి నుంచి తప్పించటానికి. బాంబుల నొకసారి ఆప్యాయంగా ముద్దు పెట్టుకొని ఫ్యూజ్ లాగి క్రిందకు విసిరాను. మరో రెండు సెకన్లలో ఏం జరగబోతోందో నాకు తెలుసు.

పళ్ళు బిగబెట్టాను. దృష్టి అంతా ఇన్‌స్ట్రుమెంట్ పానల్ పైనే నిలిపాను.

క్రింద పెద్ద విస్ఫోటం జరిగింది. కిటికీలోంచి చూశాను. మొత్తం ఐలెండ్ అంతా స్మాష్ అయిపోతోంది భయం కరమైన జ్వాలలతో.

తృప్తిగా నిట్టూర్చాను. హెలికాప్టర్ ఐలెండ్ దాటి సముద్రంపై కొచ్చాక గమనించాను అసలు ప్రమాదాన్ని.

బిల్డింగ్ పైనుంచి లేస్తోండగా సోల్జర్స్ కాల్చిన మెషిన్ గన్స్ తాలూకు గుళ్ళు పెట్రోలు టాంకును తొల్చి వేయటంతో పెట్రోలంతా ఎప్పుడో కారిపోయింది.

ఆఖరున మిగిలిన కొద్ది పెట్రోలుతో మరో పాతిక మైళ్ళు ముందు కెళుతుంది.

'నా పని కూడా ఐపోయింది' అనుకొన్నాను దూరంగా 'ఆపరేషన్ నటూనా' వైపు దూసుకొస్తున్న చైనీస్ నావల్ వార్ షిప్ ను చూసి.

సముద్రం వైపు కూలిపోతోంది హెలికాఫ్టర్. పారాచూట్ అందుకొని క్రిందకు ఉరికాను. సముద్రంపై చేరుకోగానే పారాచూట్ గాల్లో కెగిరిపోయింది.

కళ్ళు మూతలు పడుతున్నాయ్. మనస్ఫూర్తిగా దేవుడిని తల్చుకొన్నాను నీటిపై తేలుతూ.

"హేయ్! విజయ్!" పెద్దగా కేక విన్పించింది. ఆశ్చర్యపోతూ కళ్ళు తెరచాను. కొంచెం దూరంలో ఆకుపచ్చని 'సీస్పైడర్' నీటిపై తేలుతోంది.

తలుపు తెరుచుకొని నా వైపు చూస్తూ సంతోషంతో చేతులూపుతున్నాడు సి. బి. ఐ. సెకండ్ ఏజంట్ శైలేందర్. మిశ్రాగారు అప్పుడే నా రక్షణకు ఏర్పాట్లు చేశారన్న మాట.

కదిలే ఓపిక లేక అలాగే వుండిపోయాను. 'సీస్పైడర్' నా దగ్గరకు చేరుకొంది. లోనికి తీసుకొన్నాడు నన్ను శైలేంద్ర. నెమ్మదిగా నీటిలో దిగిపోయింది 'సీ స్పైడర్.'

"హలో బాస్ హౌ ఆర్ యూ?" డ్రైవింగ్ వీల్ ముందు కూర్చున్న బాబీ అడిగాడు విష్ చేస్తూ. "ఫైన్" అన్నాను, భుజంలో బుల్లెట్స్ కలుక్కుమంటుండగా.

కోపంగా చూశాడు శైలేంద్ర నైఫ్ నా జెబ్బలో దింపుతూ.

"బాబీ స్పీడుగా పోనివ్. మరో అరగంటలో చైనీస్ సబ్ మెరైన్స్ ఈ ప్రదేశాన్ని చుట్టుముడతాయ్ జాగ్రత్త." అన్నాను.

"డోన్టు వర్రీ గురూ, అవి హాంకాంగ్ నుంచి ఇక్కడికి చేరుకోనేసరికి ఎంత లేదన్నా గంటన్నర పడుతుంది. ఈ లోగా మనం 'జావా' సముద్రం మీదుగా 'సుందా జల సంధి' దాటి హిందూమహాసముద్రం చేరుకొంటాం" అన్నాడు నవ్వుతూ.

తృప్తిగా కళ్ళు మూసుకొన్నాను.

-: ఐపోయింది :-